# ప్రజా వారధి

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 244 పేజీలు : 04 వెల రూ. 2 బుధవారం 01 - 04 - 2026




తెలంగాణలో ఐదు రోజుల పాటు వర్షాలు
హైదరాబాద్ వాతావరణ కేంద్రం



2 లో

## రేవంత్ ప్రభుత్వంపై కవిత ఫైర్

- కాగ్ గణాంకాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై కవిత మండిపాటు
- రోజువారీ ఖర్చుల కోసం కూడా ఆర్బీఐ ముందు చేయి చాచాల్సిన దుస్థితి ఏర్పడిందన్న కవిత
- గత ఆర్థిక సంవత్సరంలో రెండు రోజులు మినహా 363 రోజులు ఆర్బీఐ నుంచి నిధులు తెచ్చారని విమర్శ
- రాష్ట్రంపై రూ. 8.65 లక్షల అప్పుల భారం మోపారని మండిపాటు

# అసెంబ్లీని కుస్తీల పోటీగా మార్చారు

- హరీశ్ రావు ఆగ్రహం
- రేవంత్ రెడ్డి అసెంబ్లీలో 'పహిల్వాన్' భాష మాట్లాడుతున్నారు
- అసెంబ్లీని కుస్తీల పోటీగా మార్చారని మండిపడ్డారు
- అసెంబ్లీలో పాలసీలు ఉంటాయి కానీ కుస్తీ పోటీలు ఉండవని వ్యాఖ్య
- అసెంబ్లీని ఇష్టం వచ్చినట్లు నడుపుతున్నారని ఆరోపణ
- కాళేశ్వరం ప్రాజెక్టుపై రేవంత్ రెడ్డి, సీఆర్ పాటిల్ వ్యాఖ్యలకు తేడా లేదని విమర్శ
- రెండున్నర సంవత్సరాలలో రేవంత్ రెడ్డి సభలో మాట్లాడిన ఎన్నో అనాగరిక వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయాలని డిమాండ్
- టీ బ్రేక్ పేరుతో, రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళుతున్నారని హరీశ్ రావు అన్నారు



**హైదరాబాద్ :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలసీలను గాలికి వదిలేసి, పహిల్వాన్ల భాషను మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు ధ్వజమెత్తారు. అసెంబ్లీలో పాలసీలు ఉంటాయి కానీ పహిల్వాలు, కుస్తీ పోటీలు ఉండవని ఎద్దేవా చేశారు. అసెంబ్లీని కుస్తీల పోటీగా మార్చారని మండిపడ్డారు. కత్తులతో కోలాటంలో తలలు తీసేస్తామని మరో ఎమ్మెల్యే వ్యాఖ్యానించారని మండిపడ్డారు. ఇలాంటి వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయాలని కోరారు. గడిచిన రెండున్నర సంవత్సరాలలో రేవంత్ రెడ్డి సభలో మాట్లాడిన ఎన్నో అనాగరిక వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో తమ గొంతు నొక్కివేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాక్షేత్రంలో ప్రభుత్వం వైఫల్యాలను నిలదీస్తూనే ఉంటామని హెచ్చరించారు. అసెంబ్లీని కూడా ఈ ప్రభుత్వం ఇష్టం వచ్చినట్లు నడుపుతోందని - మిగతా 2 లో

## కేరళకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



- వచ్చే నెలలో కేరళ అసెంబ్లీ ఎన్నికలు
- ప్రచార పర్వంలో దూసుకుపోతున్న పార్టీలు
- స్టార్ క్యాంపెయినర్ గా కేరళకు వెళుతున్న రేవంత్ రెడ్డి

**హైదరాబాద్ :**

వచ్చే నెలలో కేరళంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. అధికారాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యంగా కాంగ్రెస్ అధిష్ఠానం, కేరళలో ప్రచార పర్వాన్ని - మిగతా 2 లో



2 లో

## బీహార్ ఆలయంలో తొక్కిసలాట

- ఎనిమిది మంది భక్తులు మృతి
- నలంద ఆలయంలో ఘోర విషాదం
- ప్రత్యేక ప్రార్థనల వేళ తొక్కిసలాట
- భద్రతా వైఫల్యమే కారణమని భక్తుల ఆరోపణ
- మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, విచారణకు ఆదేశం

# ప్రపంచ అశాంతికి సాంస్కృతిక వారసత్వమే పరిష్కారం

- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ
- గాంధీనగర్‌లో సమ్రాట్ సంప్రతి మ్యూజియంను ప్రారంభించిన ప్రధాని మోదీ
- ప్రపంచ అశాంతికి సాంస్కృతిక వారసత్వమే సమాధానమని వ్యాఖ్య
- వేల ఏళ్ల నాటి జైన కళాఖండాలు, పురాణాలకు నిలయంగా మ్యూజియం
- ఇది కేవలం మ్యూజియం కాదు, సాంస్కృతిక ఆరాధన కేంద్రమన్న ప్రధాని



**ఢిల్లీ :**

ప్రపంచం అస్థిరత్వంతో సతమతమవుతూ, అశాంతి జ్వాలలతో దహించుకుపోతున్న క్లిష్ట సమయంలో సాంస్కృతిక వారసత్వమే మానవాళికి మార్గం చూపుతుందని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ఇవాళ మహావీర్ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని గాంధీనగర్‌లోని కోబా తీర్థ్‌లో ఏర్పాటు చేసిన 'సమ్రాట్ సంప్రతి మ్యూజియం'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ మ్యూజియం ఇచ్చే సందేశం కేవలం భారతదేశానికే కాకుండా యావత్ ప్రపంచానికి అత్యంత కీలకమని అన్నారు. అశోక చక్రవర్తి మనవడు, అహింసా మార్గాన్ని ప్రచారం చేసిన సమ్రాట్ సంప్రతి పేరుతో ఈ మ్యూజియంను ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా సేకరించిన జైన సమాజానికి చెందిన అమూల్యమైన కళాఖండాలను ఇక్కడ ప్రదర్శనకు ఉంచారు. వీటిలో కొన్ని 1000 సంవత్సరాల కంటే పురాతనమైనవి కావడం విశేషం. దశాబ్దాల పాటు తమ జీవితాలను అంకితం చేసి, భారతదేశం, నేపాల్ నుంచి ఈ కళాఖండాలను సేకరించిన జైన సన్యాసి ఆచార్య పద్మసాగర్ సూరీశ్వర్జీ సేవలను ప్రధాని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ మ్యూజియం కేవలం కళాఖండాల భాండాగారం మాత్రమే కాదని, ఇది జైన ఆరాధనకు, సంస్కృతికి, వారసత్వ పరిరక్షణకు ఒక శక్తిమంతమైన కేంద్రమని ప్రధాని మోదీ అభివర్ణించారు. కోబా తీర్థ్ ఎంతో కాలంగా శాంతికి, ఆధ్యాత్మిక సాధనకు నెలవుగా ఉందని గుర్తుచేశారు. ఈ మ్యూజియం రూపకల్పనలో వేదాలు, పురాణాలు, ఆయుర్వేదం వంటి భారతీయ సంప్రదాయాలు ప్రతిబింబిస్తాయని, ఇది మన - మిగతా 2 లో

## అమెరికా సాయం చేయదు మీ ఆయిల్ మీరే తెచ్చుకోండి

- మిత్రదేశాలపై ట్రంప్ ఫైర్
- ఇరాన్‌పై దాడులకు సహకరించని మిత్రదేశాలపై ట్రంప్ ఆగ్రహం
- మీ ఆయిల్‌ను మీరే తెచ్చుకోండి అంటూ 'ట్రూత్ సోషల్'లో పోస్ట్
- అమెరికా నుంచి కొనుగోలు చేయండి లేదా బలవంతంగా తెచ్చుకోండి అని సూచన
- హర్మూజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధించడంతో పెరిగిన చమురు ధరలు



2 లో




2 లో

## కోడి కూర తినేదెలా?

- నేటి నుంచి తెలంగాణ వ్యాప్తంగా చికెన్ షాప్‌ల బంద్
- పౌల్ట్రీ కంపెనీలు మార్జిన్‌లు పెంచాలని చికెన్ షాపు యజమానుల డిమాండ్
- ఇటీవల గతంలో కంటే మార్జిన్‌లు తగ్గించారని ఆవేదన
- కిలో చికెన్‌పై రూ.30 మార్జిన్ ఇవ్వాలని డిమాండ్
- నేడు ఇందిరాపార్క్ వద్ద మహాధర్నాకు పిలుపు

## ప్రజానాడి






## పార్లమెంటు ముందుకు అమరావతి చట్టబద్ధత బిల్లు

- ఏపీ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత
- ముందుగా లోక్‌సభలో బిల్లు ప్రవేశపెట్టనున్న కేంద్ర హోంశాఖ
- ఏపీ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధ హోదా
- విభజన చట్టంలోని సెక్షన్ 5కు సవరణ చేయనున్న కేంద్రం
- ఇప్పటికే ఏపీ అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం
- జూన్ 2, 2024 నుంచి సవరణ అమల్లోకి వచ్చేలా నిబంధన
- లోక్‌సభ ఆమోదం తర్వాత రాజ్యసభ ముందుకు రానున్న బిల్లు

**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధానిగా అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం దిశగా కీలక అడుగు పడింది. నేడు పార్లమెంట్ ముందుకు ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్ట సవరణ బిల్లు రానునుంది. దీని ద్వారా ఏపీకి అమరావతి ఏకైక రాజధానిగా గుర్తింపు లభించనుంది. ఇందుకు అనుగుణంగా నేడు లోక్‌సభలో ఆంధ్రప్రదేశ్ - మిగతా 2 లో

# 5 పిల్లర్లతో 'ఏపీ హెల్త్ మేనేజ్‌మెంట్ పాలసీ'



- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు
- ప్రతి నెలా 4వ శనివారం 'స్వర్ణాంధ్ర పాపులేషన్ మేనేజ్‌మెంట్'
- ప్రజారోగ్యంపై సీఎం చంద్రబాబు కీలక సమీక్ష
- ఏడాదిలో 56.40 లక్షల మందికి వైద్య పరీక్షలు లక్ష్యంగా నిర్దేశం
- జూలై నాటికి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని ప్రాజెక్టు అమలుకు ఆదేశం
- 5 కీలక అంశాలతో 'ఏపీ హెల్త్ మేనేజ్‌మెంట్ పాలసీ' రూపకల్పన
- సిజేరియన్లు 20 శాతానికి మించితే ఆడిటింగ్ చేయాలని స్పష్టం
- సంజీవని ప్రాజెక్టుపై క్యాంప్ కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష
- గ్రామసభలు, హెల్త్ క్యాంపులు, అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలని అధికారులకు ఆదేశం

**అమరావతి :**

మెరుగైన ప్రజారోగ్యం కోసం అందరూ ఉద్యమంలా కృషి చేయాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు. ఏప్రిల్ నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, వైద్యాధికారులు ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. ప్రతీ నెల 4వ శనివారం 'స్వర్ణాంధ్ర పాపులేషన్ మేనేజ్‌మెంట్' గ్రామసభలు, హెల్త్ క్యాంపులు, అవగాహనా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. సంజీవని ప్రాజెక్టుపై క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, సీఎస్ సాయిప్రసాద్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్, సంయుక్త కార్యదర్శి రోణంకి గోపాలకృష్ణ పాల్గొన్నారు. ఇప్పటికే చిత్తూరు జిల్లా, కుప్పం, నారావారిపల్లెలో సమర్థవంతంగా అమలు అవుతోన్న ఈ ప్రాజెక్టును జూలై కల్లా రాష్ట్రమంతటా అమలయ్యేలా చూడాలని - మిగతా 2 లో

# సంపాదకీయం

## మహిళల కోటాపై కదలిక



వచ్చే నెలలో జనగణన తొలి దశ ప్రారంభం కాబోతుండగా చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు, అందరూ చాన్నాళ్లుగా ఎదురుచూస్తున్న నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలకు సంబంధించిన పనులు ప్రారంభం కావాలని కేంద్రం తీసుకున్న నిర్ణయం స్వాగతించదగ్గది. ఈ రెండింటికీ 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుంటారు. వాస్తవానికి 2023లో మహిళా కోటా బిల్లును ఆమోదించినప్పుడు ఆ మరుసటి సంవత్సరంలో జరిగే లోక్‌సభ ఎన్నికలకే దాన్ని వర్తింపజేయాలని విపక్షాలు కోరాయి. కానీ 2026 జనగణనకు ముందుగా ఇది సాధ్యంకాదని అప్పట్లో కేంద్రం చెప్పింది. నియోజకవర్గాల పునర్విభజనకూ దీన్నే కారణంగా చూపింది. ఈ హఠాత్ పునరాలోచనకు గల కారణమేమిటో కేంద్రం వివరించలేదు. అలాగే మహిళల కోటా నిర్ణయంలో ఎలాంటి విధానాన్ని అనుసరిస్తారన్నది కూడా చెప్పలేదు. వీటికి సంబంధించిన విధి విధానాలు పార్లమెంటు ప్రత్యేక సమావేశంలో మాత్రమే తెలిసే అవకాశం ఉంది. పునర్విభజన ప్రక్రియపై రాజకీయ పక్షాల మధ్య స్పర్థలున్నా మహిళల కోటా విషయంలో అన్ని పక్షాలూ ఏకాభిప్రాయంతోనే ఉన్నాయి. అయినా ఆ చట్టం అమలు వాయిదా పడింది. కొన్ని అభివృద్ధి చెందిన దేశాలూ, మనకన్నా వెనకబడివున్న దేశాలూ కూడా మహిళలకు దశాబ్దాల క్రితమే చట్టసభల్లో కోటా ఇచ్చి గౌరవించాయి. రువాండాలో రాజ్యాంగం ప్రకారం 30 శాతం కాగా, ఆచరణలో దాదాపు 64 శాతం మంది మహిళలున్నారు. క్యూబాలో 55.7 శాతం, ఫ్రాన్స్, అర్జెంటీనా, దక్షిణాఫ్రికా, బొలివియా, మెక్సికోల్లో 50 శాతంవరకూ రిజర్వేషన్‌లున్నాయి. నేపాల్‌లో 33 శాతం కోటా అమలవుతోంది. మన ఎంపీల్లో మహిళలు 14 శాతం మించిలేరు. ఈ గణాంకాలు గమనిస్తే మనం ఎంత వెనకబడి ఉన్నామో అర్థమవుతుంది. ఈ ఏడాది జనగణన ప్రక్రియ మొదలైనా, తుది గణాంకాలకు ఏడాది పడుతుంది. స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 8 దశాబ్దాలు కావస్తున్నా జనాభాలో సగభాగం ఉన్న మహిళలకు కోటా దక్కలేదు. ఇంకా ఆలస్యం చేయొద్దనుకోవటం మంచి నిర్ణయమే. అయితే నియోజకవర్గాల పునర్విభజన వివాదాస్పదం అయ్యే అవకాశం ఉంది. జనాభా ప్రాతిపదికన పార్లమెంటు, అసెంబ్లీ స్థానాల సంఖ్య నిర్ణయించటమే ఇందుకు కారణం. 2011 గణాంకాలను ప్రాతిపదికగా తీసుకోవటంవల్ల లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న 543 స్థానాలూ 816కు ఎగబాకుతాయనీ, ఇందులో 273 స్థానాలు మహిళలకు లభిస్తాయనీ ఒక అంచనా. 2029 సార్వత్రిక ఎన్నికలకు దీన్ని వర్తింపజేస్తారు. తెలంగాణలో ఇప్పుడున్న 17 ఎంపీ స్థానాలు 26కు... 119 అసెంబ్లీ స్థానాలు 182కు పెరుగు తాయంటున్నారు. ఏపీకి ఇప్పుడున్న 25 ఎంపీ స్థానాలు దాదాపు 38కి, ప్రస్తుత 175 అసెంబ్లీ స్థానాలు 263కి చేరుతాయి. ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాదిన మహిళలు చదువుల్లో, వృత్తి ఉద్యోగాల్లో ముందుండటం, కుటుంబ నియంత్రణ వంటి కారణాలవల్ల జనాభా పెరుగుదల రేటు తగ్గింది. ఉదాహరణకు 1951లో తమిళనాడు జనాభా బిహార్‌కన్నా కొంత ఎక్కువ కాగా... ఆరు దశాబ్దాల తర్వాత బిహార్ జనాభా తమిళనాడుకన్నా ఒకటిన్నర రెట్లు అధికం. జనాభా ప్రాతిపదిక కాక, రాష్ట్రాల్లోని స్థానాలపై కొంత శాతం అధికంగా సీట్లిచ్చే విధానం ఉండాలని తమిళనాడు సీఎం స్టాలిన్ సూచిస్తున్నారు. జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాష్ట్రాలకు లోక్‌సభలో ప్రాతినిధ్యం ఉండాలన్న రాజ్యాంగ అధికరణానికి ఇది విరుద్ధం. దేశంలో ప్రతి ఒక్కరి ఓటు విలువా ఒకేవిధంగా ఉండాలన్నది దీని ఆంతర్యం. కానీ జనాభారీత్యా యూపీ ఓటరు ఓటుకుండే విలువకన్నా తమిళనాడు లేదా కేరళ ఓటరు విలువ ఎక్కువుంది. ఈ వ్యత్యాసం కొనసాగనీయటం సమర్థనీయ మేనా అన్న సందేహం తలెత్తుతుంది. ప్రతి జనగణన తర్వాత దేశంలో నియోజకవర్గాల పునర్విభజన జరగాలని రాజ్యాంగం నిర్దేశిస్తున్నా, ఇందులో ఇమిడివున్న సమస్యలను పసిగట్టి గత పాలకులందరూ వాయిదాల్లో గడిపారు. 2000 సంవత్సరం వరకూ స్తంభింపజేస్తూ 1976లో... దాన్ని 2026 వరకూ పొడిగిస్తూ 2001లో రాజ్యాంగ సవరణలు తెచ్చారు. మొత్తానికి ఈ భారం ప్రస్తుత పాలకులపై పడింది. ఎవరికీ అన్యాయం జరగకుండా, ఉత్తరదక్షిణాల వ్యత్యాసం రాకుండా సమస్యను పరిష్కరించగలిగితే దేశ సమైక్యతకు అది దోహదపడుతుంది.

# ఇది లక్షద్వీప్ కాదు... వైజాగ్!

**మొదటిపేజీ తరువాయి** – ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగ అభివృద్ధిపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా సోషల్ మీడియా వేదికగా ఒక ఆసక్తికరమైన ప్రచార వీడియోను ఆయన పంచుకున్నారు. రాష్ట్ర పర్యాటక రంగానికి కొత్త ఊపు తెచ్చే ఈ వీడియో ఇప్పుడు నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ప్రచార వీడియోలో ఏపీలోని పలు సుందర ప్రదేశాలను దేశంలోని ఇతర ప్రముఖ పర్యాటక కేంద్రాలతో పోల్చి చూపించారు. “ఇది లక్షద్వీప్ కాదు వైజాగ్... సిక్కిం కాదు కైలాసగిరి... సుందర్ బన్స్ కాదు కోరింగ... తమిళనాడు కాదు సింహాచలం... గోవాలోని బాగా బీచ్ కాదు రుషికొండ బీచ్... ఇది కేరళ కాదు కోనసీమ... ఇది ఆంధ్రప్రదేశ్“ అంటూ సాగే ఈ వీడియో రాష్ట్రంలోని ప్రకృతి రమణీయతను కళ్లకు కడుతోంది. ఈ వీడియోతో పాటు లోకేశ్ ఒక సందేశాన్ని కూడా పోస్ట్ చేశారు. “పవిత్ర ఆలయాల్లోని మంత్రోచ్ఛారణల నుంచి అంతులేని సముద్ర తీరం వరకు, కాలుష్యానికి దూరంగా ఉన్న కొండల అందాల వరకు ఆంధ్రప్రదేశ్ ఆత్మకు ఓ గొప్ప ప్రయాణం లాంటిది. ఇక్కడ ప్రకృతి, ఆధ్యాత్మికత, అవకాశాలు అన్నీ ఒకేచోట సంగమిస్తాయి. రండి, ఆంధ్రప్రదేశ్ మ్యాజిక్‌ను అనుభూతి చెందండి“ అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు.

# ప్రపంచ అశాంతికి సాంస్కృతిక వారసత్వమే పరిష్కారం

**మొదటిపేజీ తరువాయి** – భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థులు, పరిశోధకులు ఈ కేంద్రాన్ని పెద్ద సంఖ్యలో సందర్శించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మ్యూజియంలో జైన తత్వశాస్త్రం, తీర్థంకరుల జీవితాలు, ప్రాచీన తాళపత్ర గ్రంథాలు, ఆలయ నమూనాలు, చారిత్రక కళాఖండాలతో కూడిన ఏడు గ్యాలరీలు ఉన్నాయి. సంప్రదాయ ప్రదర్శనలతో పాటు ఆధునిక డిజిటల్, ఆడియో-విజువల్ టెక్నాలజీని మేళవించి సందర్శకులకు ఒక ప్రత్యేకమైన అనుభూతిని అందిస్తున్నారు.

**‘వికాస్ భీ, విరాసత్ భీ‘కి ఇది నిదర్శనమన్న గుజరాత్ ప్రభుత్వం**


ఈ కార్యక్రమంలో పాల్గొన్న గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, ఈ మ్యూజియం సాంస్కృతిక పరిరక్షణ కేంద్రంగా నిలుస్తుందని అన్నారు. డిప్యూటీ సీఎం హర్ష్ సంఘ్వీ మాట్లాడుతూ.. ‘వికాస్ భీ, విరాసత్ భీ‘ (అభివృద్ధి, వారసత్వం రెండూ) అనే ప్రభుత్వ దార్శనికతకు ఈ మ్యూజియం నిదర్శనమని, ప్రధాని చేతుల మీదుగా ఇది ప్రారంభం కావడం జైన సమాజానికి గర్వకారణమని తెలిపారు.

# బీహార్ ఆలయంలో తొక్కిసలాట

**మొదటిపేజీ తరువాయి** – బీహార్‌లోని నలంద జిల్లాలో మంగళవారం ఉదయం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మగ్రా గ్రామంలోని ప్రసిద్ధ శీతలా దేవి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో ఎనిమిది మంది మహిళా భక్తులు ప్రాణాలు కోల్పోయారు. మరో డజను మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. చైత్ర మాసం చివరి మంగళవారం కావడంతో అమ్మవారి దర్శనం కోసం వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఈ క్రమంలో ఒక్కసారిగా తోపులాట జరగడంతో భయాందోళన వాతావరణం నెలకొంది. భక్తులు పరుగులు తీయడంతో పలువురు మహిళలు కిందపడిపోయారు. వారిపై నుంచే ఇతరులు వెళ్లడంతో ఊపిరాడక 8 మంది అక్కడికక్కడే మృతి చెందారు. ఈ దుర్ఘటనకు అధికారుల నిర్లక్ష్యమే కారణమని భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి మంగళవారం ఆలయం వద్ద రద్దీ ఉంటుందని తెలిసినా, యంత్రాంగం తగిన భద్రతా ఏర్పాట్లు చేయలేదని ఆరోపిస్తున్నారు. ప్రమాద సమయంలో తగినంత మంది పోలీసులు లేరని, అంబులెన్స్‌లు కూడా ఆలస్యంగా చేరుకున్నాయని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ప్రమాదంపై బీహార్ ఉప ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. బాధితులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించినట్లు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

# 5 పిల్లర్లతో ‘ఏపీ హెల్త్ మేనేజ్‌మెంట్ పాలసీ‘

**మొదటిపేజీ తరువాయి** – సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. వచ్చే ఏడాదిలోగా రాష్ట్రంలో 56.40 లక్షల మందికి వైద్య పరీక్షలు జరపాలనే లక్ష్యాన్ని అధికారులకు సీఎం నిర్దేశించారు. వైద్య పరీక్షల ఫలితాలను వాట్సప్ ద్వారా నేరుగా 48 గంటల్లో వారికి అందించాలని చెప్పారు. అయితే ఇందుకోసం 904 మొబైల్ మెడికల్ యూన్సిట్ అవసరం కానున్నాయని రూ.162 కోట్లు వ్యయం అవుతుందని అధికారులు వివరించగా అందుకు సీఎం అంగీకారం తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 3.14 లక్షల మంది సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్ డేటాబేస్‌లో నమోదు చేసుకున్నారని అధికారులు సీఎంకి వివరించారు. వ్యక్తిగత హెల్త్ రికార్డ్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ అయ్యేలా చూడాలని సీఎం అన్నారు. భవిష్యత్‌లో వైద్య ఖర్చులు తగ్గేలా సేవలు అందించగలగాలని, ప్రివెంటివ్ హెల్త్‌పై దృష్టి పెట్టాలని సూచించారు. యోగా, న్యూట్రిషన్, మెడిటేషన్, ప్రాణాయామం వంటివి తప్పనిసరిగా అనుసరించడం వల్ల చాలా వరకు ఆరోగ్య సమస్యలకు పరిష్కారం



లభిస్తుందని చెప్పారు. సంజీవని ప్రాజెక్టు అమలవుతున్న చిత్తూరు జిల్లాలో ప్రజారోగ్యం ఏమేరకు మెరుగయ్యిందో పరిశీలించాలని అధికారులకు సీఎం సూచించారు. వైద్యారోగ్య శాఖలో ఎక్కడా ఖాళీలు ఉండకూడదు: మాతృత్వ, శక్తి, నైపుణ్యం, క్షేమ, సంజీవని ఈ 5 పిల్లర్లతో త్వరలో ‘ఏపీ హెల్త్ మేనేజ్‌మెంట్ పాలసీ’ తీసుకురావాలని అధికారులకు సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. త్వరలో ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ద్వారా రాష్ట్రంలో యూనివర్సల్ హెల్త్ పాలసీ అమలుపైనా సమీక్షించారు. యూనివర్సల్ హెల్త్ పాలసీలో భాగస్వామి అయ్యేందుకు పలు బీమా సంస్థలు ముందుకు వస్తున్నట్టు అధికారులు తెలిపారు. పీపీపీ విధానంలో చేపట్టదలచిన మెడికల్ కాలేజీల నిర్మాణంపై చర్చించారు. వైద్యారోగ్య శాఖలో ఎక్కడా ఖాళీలు ఉండకూడదని, రేషనలైజేషన్ ద్వారా ఖాళీలు ఎప్పటికప్పుడు భర్తీ చేయాలని సీఎం స్పష్టం చేశారు. ఫార్మసీ నెట్వర్క్, ల్యాబొరేటరీ ఇంట్రిగ్రేషన్ జరగాలని అనారోగ్య సమస్యలు, అత్యవసర వైద్య పరిస్థితులు, వైద్య బృందం సూచనల మేరకు మాత్రమే గర్భిణులకు ఇకపై సిజేరియన్లు చేయాలని మిగిలిన సమయంలో నార్మల్ డెలివరీలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. 20 శాతానికి మించి సిజేరియన్లు జరిగితే ఆడిటింగ్ చేయాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు.

# పార్లమెంటు ముందుకు అమరావతి చట్టబద్ధత బిల్లు

**మొదటిపేజీ తరువాయి** – పునర్వ్యవస్థీకరణ బిల్లు, 2026 బిల్లును కేంద్ర హోంశాఖ ప్రవేశ పెట్టనుంది. దీనిపై ఈ నెల 28న రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. రాష్ట్ర ప్రభుత్వ తీర్మానానికి అనుగుణంగా బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం ముందడుగు వేసింది. లోక్‌సభ బిజినెస్ జాబితాలో ఈ మేర చట్టసవరణ బిల్లు డ్రాఫ్ట్ అప్లోడ్ చేశారు. లోక్‌సభ ఆమోదం తర్వాత రాజ్యసభ ముందుకు ఈ బిల్లు వెళ్లనుంది. ఉభయ సభల ఆమోదం తర్వాత రాజపత్రం (గెజిట్) విడుదల కానుంది. దీంతో అమరావతికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఏకైక రాజధానిగా అధికారికంగా గుర్తింపు దక్కుతుంది. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వివరణ: ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టసవరణ బిల్లు లక్ష్యాలు, కారణాలపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వివరణ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం- 2014లో సెక్షన్ 5 ప్రకారం, నిర్ణీత తేదీ నుంచి 10 ఏళ్లపాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు హైదరాబాద్ సంయుక్త రాజధానిగా ఉంటుందని తెలిపారు. ఆ కాలం పూర్తయ్యాక హైదరాబాద్ తెలంగాణ రాజధానిగా కొనసాగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధాని ఏర్పాటవ్వాలని తెలిపారు. దీనిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర పరిశీలన, సంప్రదింపులు, ప్రణాళికల అనంతరం “అమరావతి” ని కొత్త రాజధానిగా గుర్తించి ప్రకటించిందన్నారు. అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ఏర్పాటు చేసే లక్ష్యంతో అక్కడ మౌలిక వసతుల అభివృద్ధితోపాటు పలు పరిపాలనా శాసన చర్యలు చేపట్టబడ్డాయన్నారు. 2026 మార్చి 28న ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఈ మేర తీర్మానం ఆమోదించిందన్నారు. విభజన చట్టంలోని సెక్షన్-5ను సవరించి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్త రాజధానిగా “అమరావతి” పేరును చేర్చాలని భారత ప్రభుత్వాన్ని కోరిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ తీర్మానానికి అమలు చేస్తూ రాష్ట్ర రాజధాని విషయంలో చట్టబద్ధమైన స్పష్టత ఇవ్వడానికి ఆ చట్టంలోని సెక్షన్ 5లోని ఉపవిభాగం (2)ను సవరించి, “అమరావతి” పేరును ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్త రాజధానిగా చేర్చాలని ప్రతిపాదించబడిందని వివరించారు. ఈ మార్పు 2024 జూన్ 2 నుంచి అమల్లోకి వచ్చినట్లుగా పరిగణించబడుతుందని అమిత్‌షా వెల్లడించారు. అమరావతి రాజధాని పరిణామాలు: 2014 జూన్ 2వ తేదీన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ద్వారా రాష్ట్ర విభజన జరిగింది. కానీ హైదరాబాద్ 10 ఏళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా ఉంటుందని అప్పట్లో నిర్ణయించారు. 2014 సెప్టెంబర్‌లో ఏపీ నూతన రాజధానిగా అమరావతి అని అప్పటి సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ క్రమంలో 2015 అక్టోబర్ 22న ప్రధాని మోదీ చేతుల మీదుగా అమరావతి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2016-2019 మధ్య వెలగపూడిలో తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీ భవనాలు పూర్తి చేసి పరిపాలన ప్రారంభించారు. రాజధాని కోసం సింగపూర్ సంస్థల భాగస్వామ్యంతో మాస్టర్ ప్లాన్ రూపొందించి మౌలిక సదుపాయాల పనులు చేపట్టారు. జూన్ 2016న హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి పరిపాలనను ఏపీకి తరలించే ప్రక్రియ ఊపందుకుంది. అలాగే అప్పుడే ఉద్యోగుల తరలింపు ప్రారంభమైంది. అక్టోబర్ 2016న వెలగపూడిలో రికార్డు స్థాయిలో కేవలం కొన్ని నెలల్లోనే నిర్మించిన తాత్కాలిక సచివాలయ భవనాలు ప్రారంభమయ్యాయి. అక్కడి నుంచే పూర్తిస్థాయి పరిపాలన మొదలైంది. 2017 ఫిబ్రవరిలో అమరావతిలో తాత్కాలిక అసెంబ్లీ భవనం ప్రారంభమవగా శాసనసభ సమావేశాలు మొదటిసారిగా అక్కడ నిర్వహించారు. 2018లో శాశ్వత ప్రభుత్వ భవనాల డిజైన్లను ప్రభుత్వం ఖరారు చేయగా సచివాలయం కోసం 2 ఐకానిక్ టవర్ల నిర్మాణానికి పునాదులు పడ్డాయి. 2019 ఫిబ్రవరిలో తాత్కాలిక హైకోర్టు భవనం ప్రారంభించగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీనిని ప్రారంభించారు. భూ సమీకరణ ప్రక్రియ: 2014 డిసెంబర్ 8న భూసమీకరణ కోసం అప్పటి టీడీపీ ప్రభుత్వం అధికారికంగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రక్రియను రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ చట్టం ప్రకారం చేపట్టారు. 2014 డిసెంబర్ 30న ఏపీ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ చట్టం అమలులోకి వచ్చింది. ముందుగా తుళ్లూరు, తాడికొండ, మంగళగిరి మండలాల్లోని 29 గ్రామాల్లో భూసమీకరణ కోసం తొలి స్పందన ప్రారంభమైంది. రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సమ్మతి పత్రాలు (9.27 ఫారాలు) ఇవ్వడం మొదలుపెట్టారు. 2015 ఫిబ్రవరి 28న ప్రభుత్వం విధించిన గడువు ముగిసే నాటికి 33,927 ఎకరాల భూమిని 28 వేల మంది రైతులు ప్రభుత్వానికి అప్పగించారు. రాజధానిగా గుర్తిస్తూ పనులు పునఃప్రారంభం: 2024లో జరిగిన ఎన్నికల్లో కూటమి విజయం సాధించడంతో అమరావతిని ఏకైక రాజధానిగా గుర్తిస్తూ పనులు పునఃప్రారంభమయ్యాయి. అలానే విభజన చట్టాన్ని సవరించి అమరావతికి శాశ్వత చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర మంత్రివర్గం, శాసనసభ తీర్మానం చేసి లోకసభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్, కేంద్ర హోం మంత్రికి పంపింది.

# అమెరికా సాయం చేయదు మీ ఆయిల్ మీరే తెచ్చుకోండి

**మొదటిపేజీ తరువాయి** – అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మిత్రదేశాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇరాన్‌పై సైనిక చర్యలో అమెరికాకు సహకరించని దేశాలు, తమకు కావాల్సిన చమురును తామే తెచ్చుకోవాలని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ‘ట్రూత్ సోషల్‘లో ఒక పోస్ట్ పెట్టారు. “ఇరాన్‌ను దెబ్బతీసే చర్యల్లో పాల్గొనడానికి నిరాకరించిన యునైటెడ్ కింగ్‌డమ్ వంటి దేశాలకు నాదొక సూచన. మీకు రెండు మార్గాలున్నాయి. ఒకటి, మా దగ్గర పుష్కలంగా ఉన్న చమురును కొనుగోలు చేయండి. రెండు, కాస్త ధైర్యం తెచ్చుకుని హర్మూజ్ జలసంధికి వెళ్లి, మీకు కావాల్సిన చమురును మీరే తెచ్చుకోండి“ అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. అంతేగాక మిత్రదేశాలు ఇకపై తమ కోసం తాము పోరాడటం నేర్చుకోవాలని హితవు పలికారు. “అమెరికా మీకు సాయం చేయడానికి రాదు. మాకు అవసరమైనప్పుడు మీరు ఎలాగైతే దూరంగా ఉన్నారో, మేమూ అలాగే ఉంటాం. ఇరాన్‌ను మేము ఇప్పటికే దెబ్బతీశాం. కష్టమైన పని పూర్తయింది. ఇక వెళ్లి మీ చమురును మీరే తెచ్చుకోండి“ అని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించి నెల రోజులు దాటినా, ఇరాన్ ఇప్పటికీ హర్మూజ్ జలసంధిపై తన పట్టును కొనసాగిస్తోంది. ప్రపంచంలోని ఐదో వంతు చమురు రవాణా ఈ జలసంధి గుండానే జరుగుతుంది. ఇరాన్ దిగ్బంధనం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఇది ప్రపంచ స్టాక్ మార్కెట్లను కుదిపేయడంతో పాటు అనేక నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు కారణమైంది.

# కేరళకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**మొదటిపేజీ తరువాయి** – మరింత వేడెక్కించడానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రంగంలోకి దించింది. ఈ సాయంత్రం ఆయన కేరళంకు బయలుదేరి వెళ్లనున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంలో కీలక పాత్ర పోషించిన రేవంత్ రెడ్డిని, ఇప్పుడు కేరళంలో ‘స్టార్ క్యాంపెయినర్‘గా నియమించారు. ఆయన వాగ్ధాటి, మాస్ అప్పీల్ కేరళ ఓటర్లను, ముఖ్యంగా యువతను ఆకట్టుకుంటుందని ఏఐసీసీ భావిస్తోంది. రెండు రోజుల పాటు ఆయన అక్కడ విస్తృతంగా పర్యటించి, పలు బహిరంగ సభలు, రోడ్ షోలలో పాల్గొని పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం చేయనున్నారు. కేవలం ముఖ్యమంత్రి మాత్రమే కాకుండా, తెలంగాణకు చెందిన పలువురు కీలక మంత్రులకు కూడా కేరళం ఎన్నికల బాధ్యతలను అధిష్ఠానం అప్పగించింది. ఎర్నాకులం, హోసూరు జిల్లాల ఇన్చార్జిగా నియమితులైన శ్రీధర్ బాబు ఏప్రిల్ 7 వరకు అక్కడే ఉండి ఎన్నికల వ్యూహాలను పర్యవేక్షించనున్నారు. మరో మంత్రి పొంగులేటి ఇప్పటికే కేరళంకు చేరుకున్నారు. పతినంతిట్ట జిల్లాలోని ఆడూరు, అరుణ్మల నియోజకవర్గాల్లో ఆయన ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈయన కూడా ఏప్రిల్ 7 వరకు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండనున్నారు.



# కోడి కూర తినేదెలా?

**మొదటిపేజీ తరువాయి** – రాష్ట్రంలో నేటి నుంచి చికెన్ దుకాణాలు మూతపడనున్నాయి. పౌల్ట్రీ కంపెనీలు రిటైల్ షాపులకు కమీషన్ తగ్గించాయని వెంటనే వాటిని పెంచాలని డిమాండ్ చేస్తూ అప్పటివరకు దుకాణాలు మూసివేయాలని చికెన్ షాపుల అసోసియేషన్ నిర్ణయించింది. తమకు న్యాయం చేయాలంటూ నేడు మహాధర్నాకు పిలుపునిచ్చారు. కిలో చికెన్‌పై ప్రస్తుతం ఇస్తున్న మార్జిన్‌ను రూ. 26ను రూ.30 వరకు పెంచాలన్నది వారి ప్రధాన డిమాండ్. దీనికోసమే నేటి నుంచి తెలంగాణ వ్యాప్తంగా చికెన్ షాప్‌ల బంద్ చేపట్టాలని నిర్ణయించారు. హైదరాబాద్‌లోని తార్నాకలో ఏర్పాటు చేసిన రాష్ట్ర చిల్లర దుకాణాల యజమానుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రోజురోజుకు పెరుగుతున్న అద్దెలు, కూలీల జీతాలు, విద్యుత్తు బిల్లులు, రవాణా ఛార్జీల నిర్వహణ భారంగా పరిణమిస్తున్న నేపథ్యంలో కంపెనీలు చెల్లించే మార్జిన్ న్యాయబద్ధంగా లేదని, తమకు నష్టాలే మిగులుతున్నాయని అసోసియేషన్ ఆక్షేపించింది. నేడు ఉదయం 9 గంటల నుంచి దుకాణాలు బంద్ చేసి ఇందిరా పార్కు వద్ద మహాధర్నా చేయబోతున్నట్లు సభ్యులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, పౌల్ట్రీ కంపెనీలు స్పందించాలని తెలంగాణ రాష్ట్ర చిల్లర దుకాణాల యజమానుల సంఘం డిమాండ్ చేసింది. చికెన్ షాప్స్ ఓనర్స్ అసోసియేషన్స్ అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ తమకు ముందుగా తమకు ప్రజలు సహకరించాలని కోరుతున్నట్లు తెలిపారు. గత 20 ఏళ్లుగా పౌల్ట్రీ కంపెనీలు రిటైల్ షాప్‌లకు ఇస్తున్న మార్జిన్‌లో ఇప్పుడు కోత విధించి చిన్న చిన్న దుకాణాలను లేకుండా చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి ఆలోచనను పౌల్ట్రీ కంపెనీలు మానుకోవాలని సూచించారు. మార్జిన్‌లో ఎటువంటి కోత పెట్టకూడదన్నారు. 20 ఏళ్ల క్రితం, ప్రస్తుత కాలంలో చాలా మార్పులున్నాయని, గతంలో కూలీలకు 5 నుంచి 6 వేల వరకు జీతాలు ఇచ్చేవారమని ఇప్పుడు ఒక్కరికే 20 నుంచి 25 వేల వరకు చెల్లిస్తున్నామని అన్నారు. ఇలా ఒక్కో షాపులో ముగ్గురు వర్కర్లు పని చేస్తున్నారని చెప్పారు. ఇప్పుడు నష్టాలు వస్తున్న నేపథ్యంలో వాళ్లకు కూడా జీతాలు చెల్లించే పరిస్థితి లేదని వాపోయారు. ఎంత మార్జిన్ ఇస్తే వర్కౌట్ అవుతుందనే విషయం పౌల్ట్రీ కంపెనీలకు తెలుసన్నారు. కానీ కావాలనే ఈ చిన్న చిన్న దుకాణాలను లేకుండా చేయాలని చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాము వేరే దగ్గరకు వెళ్లి బిజినెస్ పెట్టుకుని చేసే పరిస్థితి లేదని తెలంగాణ చికెన్ షాప్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు అన్నారు. ప్రభుత్వం కూడా తమ ప్రభుత్వంపై దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ధర్నా చేయబోతున్నట్లు ప్రకటించారు. అన్ని జిల్లాల నుంచి చికెన్ షాపు దుకాణాదారులు పాల్గొంటారని తెలిపారు. శాంతియుతంగా తమ నిరసన ఉంటుందన్నారు. తమకు న్యాయమైన మార్జిన్ వచ్చే వరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. తాము ఇప్పుడు కేవలం కిలో చికెన్‌పై రూ.4 మార్జిన్ పెంచమని అడుగుతున్నట్లు తెలిపారు. అది కూడా వెయిట్ లాస్ పోతుందని చెప్పారు. తమలాంటి చిన్నచిన్న షాపులకు ఎటువంటి డిమాండ్లు ఉండవన్నారు. ఇప్పుడు పౌల్ట్రీ రంగం మొత్తం కార్పొరేట్ అయ్యిందని వాపోయారు. తమకు న్యాయమైన మార్జిన్ ఇచ్చేవరకు ఈ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

# అసెంబ్లీని కుస్తీల పోటీగా మార్చారు

**మొదటిపేజీ తరువాయి** – ఆగ్రహం వ్యక్తం చేశారు. టీ బ్రేక్ పేరుతో, రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళుతున్నారని, ముఖ్యమంత్రి కేరళ నుంచి వస్తున్నారని, ఆర్థిక మంత్రి ప్రిపేర్ అవుతున్నారని, లంచ్ బ్రేక్ అంటూ ఇలా వివిధ కారణాలతో సభను గంటల పాటు వాయిదా వేస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వివిధ కారణాలతో అసెంబ్లీ సమయాన్ని వృథా చేశారని మండిపడ్డారు. కావాలని సభను రాత్రి వరకు నడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేరళ ఎన్నికల కోసం శాసనసభను 30వ తేదీనే నిరవధిక వాయిదా వేశారని ఆరోపించారు. కేరళ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అవసరమేమో కానీ తెలంగాణ ప్రజలకు, బీఆర్ఎస్ శాసనసభ్యులకు ప్రజా సమస్యలు ముఖ్యమని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ వ్యాఖ్యలకు పెద్దగా తేడా లేదని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వమే అన్ని అనుమతులు ఇచ్చిందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు, సుప్రీంకోర్టు కూడా కాళేశ్వరం చాలా గొప్ప ప్రాజెక్టు అని ప్రశంసించాయని అన్నారు. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ లాంటి వారు కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరప్రదాయిని అని అన్నారని గుర్తు చేశారు. ఇటీవల పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం పెట్టిన ఎకనామిక్ సర్వేలో కాళేశ్వరం వల్ల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని చెప్పిందని వెల్లడించారు. అసెంబ్లీలో ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా కాళేశ్వరం వల్ల గత రెండేళ్లలో వేల ఎకరాల సాగు భూమి విస్తీర్ణత పెరిగిందని నివేదిక పెట్టారని తెలిపారు. ఆలేరు నియోజకవర్గంలో గంధమల్ల ప్రాజెక్టుకు, మూసీలో తెచ్చే గోదావరి నీళ్లు కాళేశ్వరం నుండి వస్తున్నాయని తెలిపారు. సీఆర్ పాటిల్ తెలంగాణకు వచ్చి ఇక్కడ రైతులను నీళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయని అడిగితే సమాధానం వస్తుందని అన్నారు. కేవలం బీఆర్ఎస్ పార్టీ మీద బురదజల్లడానికే కాళేశ్వరం గురించి తప్పుగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో రూ.50 కోట్లు ఖర్చు చేస్తే మరో 2 లక్షల ఎకరాల ఆయకట్టు వస్తుందని రెండేళ్ల నుంచి దాదాపు 20 లేఖలు రాస్తున్నా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందించడం లేదని ఆరోపించారు. మా మీద కోపం ఉంటే తీర్చుకోవచ్చు... కానీ ఆ కోపాన్ని రైతుల మీద చూపించవద్దని కోరారు.

# రేవంత్ ప్రభుత్వంపై కవిత ఫైర్



**మొదటిపేజీ తరువాయి** – తెలంగాణ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందని, రోజువారీ ఖర్చుల కోసం కూడా ప్రభుత్వం ఆర్బీఐ ముందు చేయి చాచాల్సిన దుస్థితి ఏర్పడిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కాగ్ వెల్లడించిన గణాంకాలను ప్రస్తావిస్తూ ఆమె సోషల్ మీడియాలో ఒక సుదీర్ఘ పోస్ట్‌ను పెట్టారు. కాగ్ నివేదిక ప్రకారం... గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఏడాది మొత్తం మీద కేవలం రెండు రోజులు తప్ప, మిగిలిన 363 రోజులు ప్రభుత్వం ఆర్బీఐ నుండి వేస్ అండ్ మీన్స్ అడ్వాన్సులు, ఓవర్ డ్రాఫ్ట్‌ల పేరుతో నిధులు సేకరించిందని కవిత పేర్కొన్నారు. “సుమారు రూ. 1.30 లక్షల కోట్లు తెచ్చి సర్కారును నెట్టుకొచ్చారు. 2025 మార్చి 31 నాటికి సుమారు రూ. 6 వేల కోట్లు తిరిగి చెల్లించలేని స్థితిలో ప్రభుత్వం ఉంది“ అని ఆమె ఆరోపించారు. రాష్ట్రానికి నెలకు రూ. 12 వేల కోట్ల సొంత ఆదాయం ఉన్నప్పటికీ, రోజువారీ ఖర్చులకు కనీసం రూ. 1.38 కోట్ల బ్యాలెన్స్ కూడా మెయింటైన్ చేయలేకపోతున్నారని కవిత విమర్శించారు. రాష్ట్రంపై మొత్తం రూ. 8.65 లక్షల కోట్ల అప్పులు మోపి, ప్రతి కుటుంబంపై సగటున రూ. 9 లక్షల భారాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం వేసిందని ధ్వజమెత్తారు. అప్పులు తెస్తూ ఇంకా మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రమని చెప్పడం ప్రజలను వంచించడమేనని ఆమె మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ‘సంపద పెంచుతాం.. పేదలకు పంచుతాం‘ అని కాంగ్రెస్ నేతలు చెప్పిన మాటలు వట్టి డొల్ల అని కాగ్ నివేదికతో తేలిపోయిందని కవిత ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఖజానా ఖాళీ చేసి, తెలంగాణను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేసిన ఘనత ప్రస్తుత ప్రభుత్వానిదేనని ఆమె తన పోస్ట్‌లో పేర్కొన్నారు. కాగ్ నివేదిక సాక్షిగా ప్రభుత్వ వైఫల్యం బట్టబయలైందని ఆమె స్పష్టం చేశారు.

## రాయికల్‌లో ఉచిత నైపుణ్య శిక్షణ కోర్సులు ప్రారంభం




**రాయికల్, మార్చ్ 31 (ప్రజా మంటలు):** జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో ప్రతిమ ఫౌండేషన్, జీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలు, యువత కోసం ఉచిత నైపుణ్య శిక్షణ కోర్సులు ప్రారంభం కానున్నాయి. ఈ కోర్సులు 2026 ఏప్రిల్ 1వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని నిర్వాహకులు నాగిరెడ్డి రఘుపతి (జగిత్యాల జిల్లా స్కిల్ కమిటీ సభ్యులు)తెలిపారు.టైలరింగ్ (మహిళలకు), హోమ్ ఎయిడ్ హెల్త్ (మహిళలకు), ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ (పురుషులు, మహిళలకు) వంటి కోర్సులు అందుబాటులో ఉండగా, ప్రతి కోర్సులో 30 మందికి మాత్రమే అవకాశం కల్పించారు.ఈ కోర్సుల్లో చేరదలచిన అభ్యర్థులు తమ టెన్త్ మెమో, ఆధార్ కార్డు ప్రతులను 9963347142 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించి ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ముందుగా నమోదు చేసుకున్న వారికి మాత్రమే ప్రవేశం కల్పిస్తారు.విద్యార్హతలు:టైలరింగ్ కోర్సుకు 5వ తరగతి పాస్ లేదా చదవడం, రాయడం తెలిసి ఉండాలిహోమ్ ఎయిడ్ హెల్త్, ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ కోర్సులకు 10వ తరగతి లేదా ఐటీఐ పాస్ అవసరంఈ రెండు కోర్సులకు (హోమ్ ఎయిడ్ హెల్త్, ఎలక్ట్రికల్) ఉచిత హాస్టల్, భోజన సౌకర్యాలు కూడా కల్పించనున్నట్లు తెలిపారు.వయోపరిమితి:18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల తెలంగాణ రాష్ట్రంలోని ఏ జిల్లా వాసులైనా అర్హులు.శిక్షణలో భాగంగా కంప్యూటర్ బేసిక్స్ కూడా బోధించబడుతుంది. కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్‌తో పాటు ప్లేస్‌మెంట్ సహాయం అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వివరాలకు 9963347142 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## మెట్పల్లిలో విపశ్యన ధ్యానంపై అవగాహన సదస్సుకు మంచి స్పందన





**మెట్పల్లి, మార్చ్ 31 (ప్రజా మంటలు):** మనసును నిర్మలపరిచే మార్గంగా విపశ్యన ధ్యానం ఎంతో ఉపయోగకరమని నిపుణులు తెలిపారు. మెట్పల్లిలో తొలిసారిగా నిర్వహించిన విపశ్యన ధ్యాన అవగాహన సదస్సుకు స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.బాదనకుర్తి విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక విశ్రాంత ఉద్యోగ భవనంలో ఈ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రానికి చెందిన ఇన్‌చార్జి టీచర్ మధుకర్ మాట్లాడుతూ, విపశ్యన ధ్యానం 2500 సంవత్సరాల క్రితం గౌతమ బుద్ధుడు కనుగొన్న విధానమని తెలిపారు. ఈ విద్యను గురు పరంపరగా కాపాడుతూ శ్రీ సత్యనారాయణ గోయెంకా ప్రపంచవ్యాప్తంగా విస్తరించి, ఉచితంగా 10 రోజుల శిబిరాల ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారని వివరించారు.విపశ్యన ధ్యానం మనిషి మనసును అదుపులో ఉంచడంలో సహాయపడటమే కాకుండా, జీవితంలోని ఒడిదుడుకులను ఎదుర్కొనే మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. రాగ, ద్వేష, మోహాల నుంచి విముక్తి కల్పించి ప్రశాంత జీవితం గడపడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.ఈ సదస్సులో బోధకులుగా వర్షిత్, మధుకర్, రవీందర్, పులివెందుల సర్వేశ్వర్ పాల్గొని ధ్యాన విధానాలపై అవగాహన కల్పించారు. సుమారు 50 మంది మహిళలు, పురుషులు మరియు పరిసర ప్రాంతాల ప్రజలు హాజరయ్యారు.సదస్సు నిర్వహణలో సమన్వయకర్తలుగా సాయి ప్రసాద్, న్యాయవాది డా. తుల రాజేందర్ కుమార్ (తుల గంగవ్వ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్) తదితరులు పాల్గొన్నారు. ఇతర సీనియర్ సాధకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

## ఉద్యోగ విరమణ పొందిన ఏ ఎస్ ఐ సూర్యనారాయణ రాజు కు

### జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు



**జగిత్యాల మార్చి 31 ( ప్రజా మంటలు) :** పోలీస్ శాఖలో గత 36 సంవత్సరాలుగా విధులు నిర్వహించి ప్రస్తుతం వెల్గటూర్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందుతున్న ఏ ఎస్ ఐ సూర్యనారాయణ రాజు ను జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అశోక్ కుమార్ పూలమాల వేసి శాలువలతో ఘనంగా సన్మానించారు.సుదీర్ఘ కాలంగా పోలీస్ శాఖ లో విధులు నిర్వహించి సేవలు మరువమని అన్నారు.పదవి విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావిజీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షినారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ కిరణ్ కుమార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉర్దూ మీడియం ఉపాధ్యాయ పోస్టు లను భర్తీ చేయాలి



**జగిత్యాల మార్చి 31 ( ప్రజా మంటలు) :** పి ఆర్ టి యు టి ఎస్ జగిత్యాల జిల్లా శాఖ రిజర్వేషన్ అభ్యర్థులు లేక ఖాళీగా ఉన్న ఉర్దూ మీడియం ఉపాధ్యాయ పోస్టులను క్యారీ ఫార్వర్డ్ చేయకుండా వెంటనే భర్తీ చేయాలని పి ఆర్ టి యు టీ ఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయినపల్లి ఆనంద్ రావు యాల్ల అమర్నాథ్ రెడ్డి అన్నారు మహమ్మద్ అబ్దుల్ లతీఫ్ స్కూల్ అసిస్టెంట్ (.సోషల్ ) గవర్నమెంట్ హై స్కూల్ కాజీపూర్ జగిత్యాల ఉద్యోగ విరమణ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడుతూ ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులు మంజూరు చేయాలని వారు కోరారు .అనంతరం మహమ్మద్ అబ్దుల్ లతీఫ్ సేవల ను కొనియాడారు. లతీఫ్ ని ఘనంగా సన్మానించారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ ఆఫీజ్ మాజీ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రహీం జమైతే ఇస్లామీ హిందూ జగిత్యాల జిల్ల అధ్యక్షులు షోయబ్ ఉల్లాక్ పాహిమ్ ఉపాధ్యాయలు శ్రీనివాస్ ఖతిబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షంతో పంట దెబ్బతిన్న వరి,మామిడి తోటలు

### పరిశీలించిన మాజీ జెడ్పీ చైర్పర్సన్ వసంత



**రాయికల్ మార్చి 31 (ప్రజా మంటలు) :** మండలం కిష్టంపేట గ్రామంలో నిన్న కురిసిన వర్షాలకు నష్టపోయిన మామిడి మరియు వరి పంట పొలాలను బి ఆర్ ఎస్ నాయకులు మరియు రైతులతో కలిసి పరిశీలించి నష్టపోయిన రైతులకు ధైర్యం చెప్పిన జిల్లా తొలి జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మోసపూరిత హామీలోకి అధికారంలోకి వచ్చిందని దానికి తోడుగా ప్రకృతి కూడా రైతులపై కన్నెర్ర చేసిందని అన్నారు. అధికారులు వెంటనే పంట నష్టాన్ని అంచనా వేసి కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టో ప్రకారం పంట నష్టపరిహారాన్ని అందజేయాలని రైతుల పక్షాన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాయికల్ మండల అధ్యక్షుడు బర్కాం మల్లేష్ రూరల్ మండల అధ్యక్షుడు అయిల్నేని ఆనంద్ రావు గ్రామ శాఖ అధ్యక్షులు చిలక శ్రీనివాస్ మండల మైనార్టీ అధ్యక్షులు ఉప సర్పంచ్ ఎండి చాంద్ పాషా గ్రామ శాఖ ఉపాధ్యక్షులు ఆడేపు హరికృష్ణ వెల్దుర్తి మాజీ సర్పంచ్ బుర్ర ప్రవీణ్ గౌడ్ నాయకులు కోలా రాజకుమార్ బొంతల ఆదిరెడ్డి బుర్ల రాజు సామంతుల మల్లయ్య మారంపల్లి గంగారం కట్ట సురేష్ జోగిన్ పెల్లి సత్తయ్య రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణవేణి స్కూల్ లో ఏఎస్ఐ ప్రభాకర్ కు ఘన సన్మానం




**సికింద్రాబాద్, మార్చి 31 (ప్రజా మంటలు):** సికింద్రాబాద్ గాంధీనగర్ పోలీస్ స్టేషన్ అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ ప్రభాకర్ మంగళవారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా బోలాక్పూర్ లోని శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో ఏఎస్ఐ ప్రభాకర్ కు ఘనంగా సన్మానం జరిగింది. కృష్ణవేణి స్కూల్ లో పదవ తరగతి వార్షిక పరీక్షల్లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ ప్రభాకర్ మంగళవారం పదవి విరమణ చేస్తున్నారని తెలుసుకున్న పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు ఆయనను శాలువాతో సత్కరించి,జ్ఞాపికను అందజేశారు. పదవి విరమణ అనంతరం శేష జీవితం ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. పోలీస్ వ్యవస్థ వలనే సమాజంలో శాంతి, భద్రతలు ఉంటాయని, అలాంటి పోలీసులను సన్మానించుకోవడం ఆనందంగా ఉందని డాక్టర్ శ్రీనివాసులు మంచాల అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



**మల్లాపూర్ మార్చి 31 ( ప్రజా మంటలు) :** నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్.మంగళవారం మల్లాపూర్ మండలం ముత్యంపేట గ్రామంలోని నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా చేయాలని అధికారులకు ఆదేశించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్. కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూమంజూరైనా ఇందిరమ్మ ఇండ్లను పూర్తిస్థాయిలో గ్రౌండింగ్ చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం నిర్మించుకునే ప్రతి ఇంటికి తెలంగాణ ప్రభుత్వం 5 లక్షల రూపాయలు అందజేస్తుందని తెలిపారు. ఇటుక, కంకర, బేస్మెంట్ పై ధరల నియంత్రణ ఇండ్లు లబ్ధిదారులకు ధరలు అనుగుణంగా ఉండేలా అధికారులను కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు . తెలిపారు. అనంతరం పలు మార్కింగ్, బెస్మెంట్, స్లాబ్ లెవెల్ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి ఇళ్ల లబ్ధిదారులతో నేరుగా మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసి గృహప్రవేశం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మెట్ పెల్లి ఆర్డీవో నరసింహ రావు, హౌసింగ్ పిడి ప్రసాద్, తహసీల్దార్, ఎంపిడివో, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## షుగర్ ఫ్యాక్టరీ గోదాములను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**మల్లాపూర్ మార్చి 31 ( ప్రజా మంటలు) :** జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మల్లాపూర్ మండలం ముత్యం పేట గ్రామంలోని నిజాం షుగర్ ఫ్యాక్టరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ పరిధిలో ఉన్న గోదాములను పరిశీలించి, రాబోయే రబీ సీజన్‌కు సంబంధించి వడ్ల నిల్వకు అవి అనువుగా ఉన్నాయా లేదా అనే విషయంపై సమగ్రంగా పరిశీలించారు.గోదాముల సామర్థ్యం, భద్రతా ప్రమాణాలు, తేమ నియంత్రణ వంటి అంశాలను పరిశీలిస్తూ, వడ్లను సురక్షితంగా నిల్వ చేయడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.అదేవిధంగా, మెట్‌పల్లి డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో వడ్లు నిల్వ చేయడానికి అనువైన గోదాములను గుర్తించాలని మెట్‌పల్లి ఆర్డీవో నరసింహ రావును ఆదేశించారు. రైతులు ఇబ్బందులు పడకుండా ముందస్తు ప్రణాళికలతో నిల్వ సదుపాయాలు సిద్ధం చేయాలని సూచించారు.రాబోయే రబీ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర చర్యలు తీసుకోవాలని, నిల్వ సదుపాయాలను బలోపేతం చేయాలని ఆయన స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో మెట్ పెల్లి ఆర్డీవో నరసింహారావు, తహసీల్దార్, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## కెన్యాలో కన్నుల పండువగా రాములోరి కళ్యాణం

### మోంబాసా ప్రాంతంలో మారుమోగిన జైశ్రీరామ్ నినాదాలు






**సికింద్రాబాద్,మార్చి 31 ( ప్రజామంటలు ) :** కెన్యా దేశంలోని మోంబాసా ప్రాంతంలో స్థిరపడ్డ ఎన్నారై తెలుగు ప్రజలు శ్రీరామనవమి పర్వదిన వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. మోంబాసా తెలుగు అసోసియేషన్ (ఎంఓఎంటీఏ) ఆధ్వర్యంలో సభ్యులు సంప్రదాయబద్దంగా ప్రత్యేక కళ్యాణవేధికను అంగరంగ వైభవంగా అలంకరించి, దానిపై శ్రీరాముడి,సీతమ్మ వార్ల మూర్తులను పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల మంత్రోశ్చరణాల మధ్య సీతారాముల వారి కళ్యాణాన్ని నిర్వహించారు. ఈసందర్బంగా భక్తులకు స్వామివారి పానకం, తీర్థ, బోజన ప్రసాదాలను అందచేశారు. జైశ్రీరామ్ ...జైజై సీతారామ్...నినాదాలతో మోంబాసా ప్రాంతం మారు మోగింది. సంప్రదాయ దుస్తులు ధరించిన ఎన్నారై హిందువుల సందడితో తెలుగు వారి సాంస్కృతి,సంప్రదాయం ఉట్టి పడింది. ఏడాది అంతా వచ్చే తెలుగు పండుగలను తూచ తప్పకుండా తమ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాస్త్ర బద్దంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని చైర్మన్ వెంకట రమణ, పూర్వ చైర్మన్ బీ.వెంకటేశ్వర రావు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రంజిత్, కార్యదర్శి ప్రశాంత్,సంయుక్త కార్యదర్శి సురేంద్ర, ట్రెజరర్ రాజేశ్వరి,కల్చరల్ సెక్రటరీ మృదుల,అసోసియేట్ సభ్యులు నరేంద్ర, లోకేష్, భవాని,సలహా మండలి సభ్యులు సీతారామ్, బీవీరావు, సత్య, మెంబర్స్ తో పాటు తమిళ్,కన్నడ,కేరళ,గుజరాతి,వెస్ట్ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన అసోసియేషన్ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## చెరువు కట్ట పనులకు శ్రీకారం చుట్టిన సర్పంచ్




**వేలేరు మార్చి 31 (ప్రజా మంటలు) :** గ్రామంలోని మామిడి చెరువు కట్ట వద్ద జంగిల్ కటింగ్, మరమ్మత్తు పనులను గ్రామ సర్పంచ్ మరిజే అనిత నరసింహారావు మంగళవారం ప్రారంభించారు. లోడీ సాంఘిక సేవ సంస్థ ఫాతిమా నగర్ వారి ఆధ్వర్యంలో, గ్రామ రైతుల కోరిక మేరకు ఈ పనులకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా సర్పంచ్ అనిత మాట్లాడుతూ, చెరువు పరిసర ప్రాంతాలను శుభ్రపరచడం వల్ల నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని, దీని ద్వారా రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగుపడుతుందని తెలిపారు. గ్రామాభివృద్ధికి ఇలాంటి పనులు ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుడికందుల ప్రశాంత్, గ్రామ పంచాయతీ కార్యదర్శి తోట అనిల్, వార్డు సభ్యులు కొలిపాక వెంకటేష్, జగన్, ఒద్దుల శ్రీకాంత్, లోడీ సంస్థ పీచర క్లస్టర్ ఆర్గనైజర్ వేముల ప్రసాద్, వేలేరు క్లస్టర్ ఆర్గనైజర్ జోగు ప్రసాద్, సుధాకర్, స్వామి, పిట్టల యాదగిరి, అల్ల రవి, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా జెఎస్ఆర్



**భీమదేవరపల్లి మార్చి 31 (ప్రజా మంటలు) :** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీలో హుస్నాబాద్ నియోజకవర్గానికి (పూర్వ ఉమ్మడి భీమదేవరపల్లి మండలం) కన్నారం గ్రామానికి చెందిన జన్నపురెడ్డి రెడ్డి సురేందర్ రెడ్డికి కీలక బాధ్యతలు వరించాయి. పార్టీ బలోపేతానికి ఆయన చేస్తున్న కృషిని గుర్తిస్తూ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు, అధిష్టానం ఆయనను మరొకసారి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమించింది. ఈ సందర్భంగా జెఎస్ఆర్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన పార్టీ రాష్ట్ర నాయకత్వానికి, కేంద్ర పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో హుస్నాబాద్ నియోజక వర్గంలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆయన నియామకం పట్ల మండలంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హుస్నాబాద్ ప్రాంత అభివృద్ధికి, ముఖ్యంగా వేసవిలో మంచినీటి సరఫరా వంటి సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు చేరువైన సురేందర్ రెడ్డికి ఈ పదవి దక్కడం పట్ల పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

## "అప్పుల్లో ముంచిన ప్రభుత్వం" కాంగ్రెస్‌పై కవిత ఆగ్రహం



**హైదరాబాద్, మార్చ్ 31 (ప్రజా మంటలు):** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కాగ్ నివేదిక ఆధారంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిందని, రోజువారీ ఖర్చులకే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద అప్పులు తీసుకునే దుస్థితి ఏర్పడిందన్నారు. ఏడాదిలో భారీగా అప్పులు చేసి కూడా "మిగులు బడ్జెట్" అంటూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు.రాష్ట్రంపై లక్షల కోట్ల అప్పు భారమోపి, ఒక్కో కుటుంబంపై భారీ భారం పడేలా చేశారని విమర్శించారు. సంపద పెంచుతామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అప్పుల పాలన మాత్రమే చేస్తోందన్నారు.ఇక అకాల వర్షాలతో జగిత్యాల, కరీంనగర్, సిద్దిపేట, నిర్మల్ జిల్లాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకుని, తగిన నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి రాజీ లేని పోరాటం

### తెలంగాణ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్



**జగిత్యాల మార్చి 31 (ప్రజా మంటలు) :** రిటైర్ అయిన ఉద్యోగుల పెన్షన్ బెనిఫిట్ల విడుదలకు రాజీ లేని పోరాటం చేస్తామని తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా లో ఉద్యోగ విరమణ పొందిన 26 మంది ఉద్యోగులకు టి. పి. సి. ఏ.మెమొంటోలు, పెన్షనర్స్ పిలుపు పుస్తకాలను హరి అశోక్ కుమార్ చేతుల మీదుగా అందజేసి సన్మానించారు. సభ్యులుగా చేర్చుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గడిచిన 24 నెలలుగా రాష్ట్రములో 16వేల మంది ఉద్యోగులు ఉద్యోగ విరమణ చెందినా వాళ్లకు రావాల్సిన గ్రాట్యూటీ, కమ్యూటెడ్ పెన్షన్, జి. పి. ఎఫ్, లీవ్ ఎన్ క్యాష్ మెంట్ అన్నీ కలిసి ఒక్కొక్కరికి సరాసరి రూ. 50 లక్షల వరకు ఉంటుందని, ప్రస్తుతం వీరందరికీ నెల వారీ పెన్షన్ మాత్రమే వస్తున్నదని, ప్రభుత్వం స్పందించి ప్రతి నెలా ఉద్యోగ విరమణ చేస్తున్న వారికి ఎప్పటికప్పుడు బెనిఫిట్స్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పి. సి. హన్మంత్ రెడ్డి, కోశాధికారి గౌరి శెట్టి విశ్వనాథము,పూసాల అశోక్ రావ్, ఎం. డి. యాకూబ్ వెలముల ప్రకాష్ రావు, కండ్లీ గంగాధర్, దుబ్బేశం, సత్యనారాయణ,కట్ట గంగాదర్, ఎం. డి. ఇక్బల్, మెట్ పల్లి అధ్యక్షులు కుందేళ్ల మురళి, కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం,మల్యాల అధ్యక్షులు రెవిన్యూ యాకూ బ్, కార్యదర్శి వీరా రెడ్డి,మండలాల ప్రతినిధులు ఉప్పుగళ్ల మురళి, ఏనుగంటి రాములు, ప్రసాద్, రజాక్, సయ్యద్ యూసుఫ్, కరుణ, విజయలక్ష్మి, వీరారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే శిక్ష తప్పదు ఎస్పీ అశోక్ కుమార్

### మద్యం సేవించి నిర్లక్ష్యంగా కారు నడిపి ఒక నిరపరాధి ప్రాణం తీసిన కేసులో

### నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా

### విధిస్తూ 1వ అదనపు జిల్లా & సెషన్స్ జడ్జి శ్రీ నారాయణ తీర్పు వెలువరించారు.

**గొల్లపల్లి మార్చ్ 31ప్రజా మంటలు :** ధర్మపురి పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కుంటాల భీరయ్య (40), 02-02-2013 న సాయంత్రం సమయంలో బీడీలు కొనుగోలు చేసేందుకు జాతీయ రహదారి (-61) పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా, రాయపట్నం వైపు నుండి ధర్మపురి వైపు వేగంగా వస్తున్న మారుతి సుజుకి వ్యాగనార్ కారు (నంబర్: 6161) వెనుక నుండి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భీరయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు.ప్రమాదం అనంతరం కారు డ్రైవర్ అక్కడి నుండి పారిపోవడానికి ప్రయత్నించగా, సంఘటనను గమనించిన స్థానికులు వెంటాడి కొద్దిదూరంలో కారును ఆపి పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నిందితుడు వనం అంజయ్య (53), మంచిర్యాల జిల్లా తిలక్ నగర్ నివాసి అని గుర్తించారు.ఈ ఘటనపై మృతుడి బావ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ధర్మపురి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయగా, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్ కేసును దర్యాప్తు చేసి, నిందితుడి రక్త నమూనాలను ఫోరెన్సిక్ పరీక్షల్లో నిందితుడు మద్యం సేవించినట్లు నిర్ధారణ కావడంతో పాటు సాక్ష్యాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి శ్రీ నారాయణ నిందితుడిని దోషిగా తేల్చి పై విధంగా శిక్ష విధించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడపడం అనేది కేవలం ట్రాఫిక్ నియమాల ఉల్లంఘన మాత్రమే కాకుండా ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీసే అత్యంత ప్రమాదకరమైన చర్య అని పేర్కొన్నారు. మద్యం మత్తులో వాహనం నడిపే వ్యక్తులు తమ ప్రాణాలతో పాటు ఇతర నిరపరాధుల ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేస్తారని తెలిపారు. ఇలాంటి ఘటనల్లో నిందితులకు చట్టపరంగా కఠినమైన శిక్షలు విధించబడతాయని, జైలు శిక్షతో పాటు జరిమానాలు కూడా తప్పవని హెచ్చరించారు.కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నర్సయ్య, సిఎం ఎస్ ఎస్ఐ, శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ శ్రీధర్, సి ఎం ఎస్ కానిస్టేబుల్‌లు రాజు, కిరణ్ కుమార్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు.

## ఉచిత హెల్త్ క్యాంప్ ను ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్ వాణి



**జగిత్యాల మార్చి 31 (ప్రజా మంటలు) :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగముగా మోతేమాలవాడ పి హెచ్ సి లో నిర్వహించిన ఉచిత హెల్త్ క్యాంప్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రజలకు సమీపంలోనే నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి కార్యక్రమం ద్వారా ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు. ఉచిత వైద్య పరీక్షలు, మందులు అందించడం ద్వారా సాధారణ ప్రజలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని అన్నారు.ప్రత్యేకంగా వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు నీరు ఎక్కువగా తీసుకోవడం, వేడి నుంచి రక్షణ చర్యలు తీసుకోవడం, ఏదైనా అనారోగ్య సమస్యలు ఉంటే ఆలస్యం చేయకుండా సమీప పి హెచ్ సి ను సంప్రదించాలని సూచించారు. ప్రతి రోజూ పి హెచ్ సి లలో అందుబాటులో ఉన్న సేవలను వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించిన వైద్య సిబ్బందిని ఆమె అభినందించారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కోరే జయ గంగమల్లు, దయాల చంద్రకళ, పిట్ట ధర్మరాజు, క్యాదసు నవీన్, కూతురు రాజేష్, జిల్లా ఉపవైద్యాధికారి జైపాల్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ స్రవంతి, క్యాంపు స్పెషలిస్ట్ డాక్టర్లు పూర్ణచంద్రరావు జావేద్ అలీ కృష్ణ చైతన్య, సుజాత, లావణ్య, శిరీష, మెడికల్ సిబ్బంది మరియు ప్రజలు ఉన్నారు.

## ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు స్వామి వారిని దర్శించుకునేలా చూడాలి



**కొండగట్టు మార్చి 31 (ప్రజా మంటలు) :** హనుమాన్ చిన్న జయంతికి 914 మంది సిబ్బందితో పటిష్ట భద్రతసీసీ కెమెరాలు ద్వారా నిరంతర పర్యవేక్షణ జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు వద్ద హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా భక్తులు ప్రశాంతమైన ఆధ్యాత్మిక వాతావరణంలో స్వామి వారిని దర్శించుకునేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 914 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బందోబస్తును 5 సెక్టార్లుగా విభజించి, 3 షిఫ్టుల విధానంలో పోలీసు సిబ్బందికి విధులు కేటాయించినట్లు వెల్లడించారు. జయంతి సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు వచ్చే అవకాశం ఉందని, ఏలాంటి నేరాలకు తావులేకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విధులు నిర్వహించాలని సూచించారు. ఏదైనా సమస్య ఎదురైతే జిల్లా పోలీస్ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సుదూర ప్రాంతాల నుంచి స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు పోలీస్ సిబ్బంది ఓపికతో సలహాలు,సూచనలు ఇస్తూ విధులు నిర్వర్తించాలని,ఎక్కడ కూడా అసౌకర్యం కలగకుండా అందరూ సమన్వయంతో విధులు నిర్వహిస్తూ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ముఖ్యంగా దేవస్థానం,మాల విరమణ వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండి భక్తులు క్యూ లైన్ పాటించేలా చూడాలని,భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా 24 గంటలు పోలీస్ నిఘా ఉంచాలని ప్రతి ఒక్క భక్తుడు ప్రశాంతమైన వాతావరణంలో ఆంజనేయ స్వామిని దర్శించుకుని క్షేమంగా తిరిగి వెళ్లేవిధంగా ప్రతి పోలీస్ బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలుహనుమాన్ జయంతి సందర్భంగా కాలి నడకన వచ్చే భక్తులు రోడ్డుపైన వెళ్ళే వాహనాలు గమనిస్తూ నడవాలి ఈ కార్యక్రమంలో డిఎస్పి లు వెంకటరమణ,రఘు చందర్,రాములు,వెంకటరమణ, ఎస్ బి ఇన్స్పెక్టర్ అరిఫ్ అలీ ఖాన్,సి.ఐ లు రవి,రామ్ నరసింహారెడ్డి, సురేష్ ,అనిల్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు సైదులు, కిరణ్ కుమార్, వేణు వివిధ జిల్లాలకు చెందిన సి.ఐలు, ఎస్.ఐ లు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఏనుగులు, గుర్రాలపై వెంటాడి, వేటాడే 'తాటకి వధ'

**ఏటా 3 రోజుల ఉత్సవాలు 200 ఏళ్ల చరిత్ర**

**తాటకి వధపైనా ఏటా 3 రోజుల ఉత్సవాలు**

**మధ్యప్రదేశ్‌లోని గరౌలి గ్రామంలో 200 ఏళ్లుగా**

**వేడుకలు 18 గ్రామాల ప్రజానీకం హాజరు**

**ఉత్సవాల నిర్వహణ వెనుక చారిత్రక ఫ్లాష్‌బ్యాక్**



విశ్వామిత్ర మహర్షి యజ్ఞానికి పదేపదే అడ్డుతగులుతున్న తాటకి అనే రాక్షసిని ఒకే ఒక్క బాణంతో భగవాన్ శ్రీరాముడు అంతం చేశారు. ఆ ఘట్టాన్ని, రామబాణం శక్తిని గుర్తు చేసుకుంటూ గత 200 ఏళ్లుగా ఓ గ్రామంలో ఏటా వేడుకలు జరుపుకుంటున్నారు. ప్రతి సంవత్సరం వసంత రుతువు పంటకోత సీజన్(మార్చి - ఏప్రిల్)లో జరిగే ఈ వేడుకల్లో 18 గ్రామాల ప్రజలు పాల్గొంటున్నారు. తాటకిని వధించేందుకు ఏకంగా గుర్రాలు, ఏనుగులపై దూసుకొస్తున్నారు. తొలినాళ్లలో ఈ వేడుకలు నెల రోజులు జరిగేవి. ఇప్పుడీ ఉత్సవాలను 3 రోజులే నిర్వహిస్తున్నారు. ఇంతకీ ఎక్కడ 18 గ్రామాల ప్రజలు ఈ వేడుకల్లో ఎందుకు పాల్గొంటున్నారు? ఈ ఉత్సవాల్లో తాటకి వధ ఎలా జరుగుతుంది? ఈ కథనంలో తెలుసుకుందాం.తాటకి వధ ఉత్సవాలు ఇలా మొదలయ్యాయిమధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఛతర్‌పూర్ జిల్లా కేంద్రం నుంచి 34 కిలోమీటర్ల దూరంలో గరౌలి గ్రామం ఉంది. బ్రిటీష్ పాలనా కాలంలో ఇదొక రాచరిక సంస్థానంగా ఉండేది. 19వ శతాబ్దంలో దీని తొలి పాలకుడిగా దివాన్ బహదూర్ గోపాల్ సింగ్ జుదేవ్ బాధ్యతలు చేపట్టారు. గరౌలి సంస్థానం పరిధిలో 18 గ్రామాలు ఉండేవి. వాటి పేర్లు పుత్రయ, పచ్వారా, కుల్బారా, అకార్టోల్, గంజ్ కరారా, రాణిపుర, భడియాపుర గరౌలి, సలక్, వాంచోర్, భటేరా, అమన్‌పుర, రిచారా, సిలార్‌పూర్, సటోరా, పడ్రియా, కనేరా, నౌగావ్, కిరత్‌పుర. అప్పట్లో ఈ అన్ని గ్రామాల్లో భూస్వాములు ఉండేవారు. వీళ్లు ఏటా పంటకోత సీజన్ (మార్చి - ఏప్రిల్)లో స్థానిక రైతుల నుంచి పన్నులను వసూలు చేసేవారు. ఈ పన్నులను దివాన్ బహదూర్ గోపాల్ సింగ్ జుదేవ్‌కు చెల్లించేందుకు 18 గ్రామాల భూస్వాములు గరౌలి గ్రామానికి వచ్చేవారు. ఈ భూస్వాములను ఆనందింపజేసేందుకు దివాన్ బహదూర్ గోపాల్ సింగ్ జుదేవ్ తాటకి వధ ఉత్సవాలను ప్రారంభించారు. అప్పట్లో నెల రోజుల పాటు ఈ వేడుకలు జరిగేవి. భూస్వాములతో పాటు రైతులు కూడా పెద్దసంఖ్యలో ఈ ఉత్సవాలను చూసేందుకు వచ్చేవారు. తాటకిని వధించే భూస్వాములకు దివాన్ బహదూర్ గోపాల్ సింగ్ జుదేవ్ బహుమతులు ఇచ్చేవారు.తాటకి వధ ఉత్సవాల్లో గుర్రాలు నాటి నుంచి నేటి దాకాచరిత్రకారుడు శంకర్ లాల్ సోని కథనం ప్రకారం, నాటి నుంచి నేటిదాకా గరౌలి గ్రామంలో ఏటా తాటకి వధ ఉత్సవాలు జరుగుతున్నాయి. పంట చేతికొచ్చిన వేళ 18 గ్రామాల రైతులు ఆనందోత్సాహాలతో ఈ వేడుకల్లో పాల్గొంటున్నారు. పాత సంప్రదాయాల ప్రకారం తలపాగా, గంచా, కండువాలను ధరించి గుర్రాలు, ఏనుగులపై కూర్చొని మరీ భారీ తాటకి ప్రతిమను వెంటాడి వేటాడి వధిస్తున్నారు. తాటకిని వధించే వారికి బహుమతిని ప్రదానం చేస్తున్నారు. అనంతరం శ్రీరాముడు, లక్ష్మణుడు, సీతామాత శకటాలను ప్రదర్శనగా తాటకి వధ జరిగిన ప్రదేశానికి తీసుకొచ్చి పూజలు నిర్వహిస్తున్నారు. బ్యాండ్, డీజే, పోలీసు భద్రత నడుమ ఈ ఉత్సవాలు జరుగుతాయి.తాటకి వధ ఉత్సవాల్లో ఏనుగు బందోబస్తు నడుమ వేడుకలు'ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున ప్రజలు పాల్గొంటారు. 3 రోజుల పాటు ఈ వేడుకలు జరుగుతాయి. అందుకే మేం పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేస్తాం. ఏటా ఈ వేడుకలు ఘనంగా జరుగుతాయి' అని నౌగావ్ ఎస్‌డీఓపీ అమిత్ మెష్రామ్ తెలిపారు.ఎవరీ తాటకి రామాయణంలోని బాలకాండలో తాటకి వధ అనేది ఒక ప్రధాన ఘట్టం. ఆమె సుకేతుని కుమార్తె. మారీచుడి తల్లి. సుందుడు అనే రాక్షసుడి భార్య. తాటకిని అగస్త్య మహర్షి నరమాంస భక్షక రాక్షసిగా మారమని శపించారు. ఈ రాక్షసిని శ్రీరాముడు సంహరించడం మహర్షులకు ధైర్యాన్ని ఇచ్చింది.

# పీ-4 నినాదం కాదు, సామాజిక విప్లవం

**మార్గదర్శులకు ప్రత్యేక గౌరవం, గుర్తింపు**

**ఇస్తాం సీఎం చంద్రబాబు**

**సమాజ మార్పునకు నాంది పీ-4 విధానం**

**ఏడాదిలో 1.6 లక్షల మంది మార్గదర్శులు,**

**10.8 లక్షల మందిని దత్తత తీసుకున్నారు**

**తిరుపతిలో పీ-4 తొలి వార్షికోత్సవ సభలో**

**పాల్గొన్న సీఎం చంద్రబాబు**

**పీ-4 నినాదం కాదు, సామాజిక విప్లవమని**

**సీఎం చంద్రబాబు అన్నారు.**

ప్రపంచంలో ఎవరూ ఒంటరి కాదని, ఆపద సమయంలో నేనున్నానని భరోసా కల్పించిన కార్యక్రమం పీ-4 అని తెలిపారు. పీ-4 నవసమాజ ఉద్యమానికి ఊపిరిపోయాలని పిలుపునిచ్చారు. తిరుపతిలోని పద్మావతి మహిళా వర్సిటీలో ఏర్పాటు చేసిన పీ4 కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా నిర్వహించిన తొలి వార్షికోత్సవంలో పాల్గొన్న సీఎం లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు. ఏడాదిలో 1.6 లక్షల మంది మార్గదర్శులు 10.80



లక్షల మందిని దత్తత తీసుకున్నారని వెల్లడించారు. సమాజానికి సేవ చేయాలనుకున్న వారు ఈ కార్యక్రమంలో భాగం కావాలన్న సీఎం, మార్గదర్శులకు ప్రభుత్వం ప్రత్యేక గౌరవం, గుర్తింపు ఇస్తుందని తెలిపారు." సమాజ మార్పునకు నాంది పీ-4 విధానం. 1.6 లక్షల మంది మార్గదర్శులు, 10.8 లక్షల మందిని దత్తత తీసుకున్నారు. ఆపదలో నేనున్నానని భరోసా కల్పించే కార్యక్రమం పీ-4. పేదరిక నిర్మూలన కోసమే పీ-4 రూపొందించాం. ఒకసారి సాయం చేసి వదిలేయకుండా పరిస్థితి మారే వరకు అండగా ఉండాలి. 2047 నాటికి ఆర్థిక అసమానతలు తగ్గించాలి. పీ-4 నవసమాజ ఉద్యమానికి ఊపిరిపోయాలి. పీ-4 నినాదం కాదు, సామాజిక విప్లవం. కుప్పంలో 8,904 కుటుంబాలను 3 సంస్థలు దత్తత తీసుకున్నాయి. కుప్పంలో పీ-4 కింద సొసైటీ ఏర్పాటు చేశాం. వచ్చే ఏడాది నాటికి పీ-4లో గణనీయమైన అభివృద్ధి సాధిస్తాం. నా మీద, సమాజం మీద గౌరవం ఉంటే మీ వంతు సాయం చేయండి. మార్గదర్శులకు మా ప్రభుత్వం ప్రత్యేక గౌరవం, గుర్తింపు ఇస్తుంది. మార్గదర్శులకు ప్రత్యేక అవార్డులు అందచేస్తాం." - సీఎం చంద్రబాబుపీ-4 కార్యక్రమానికి ఏడాది పూర్తి : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీ-4 కార్యక్రమానికి ఏడాది పూర్తి అయిన సందర్భంగా వార్షికోత్సవ వేడుకలను కృష్ణా జిల్లా బంటుమిల్లిలోని విజయలక్ష్మి కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో 2396 కుటుంబాలను దత్తత తీసుకుని వారికి సహకరించిన దాతలను ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ శాలువలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ పీ-4 కార్యక్రమం విజయవంతంగా కొనసాగడానికి ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ నిరంతరం పర్యవేక్షిస్తూ విశేష కృషి చేశారని నియోజకవర్గ ప్రత్యేక అధికారి సీఎస్ఓ కన్నమ్మ నాయుడు ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్‌ను ప్రశంసించారు.ఒక ఉద్యమంగా పీ- 4 కార్యక్రమం : ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, పీ- 4 కార్యక్రమాన్ని రాష్ట్రంలో ఒక సాధారణ పథకంగా కాకుండా ఒక ఉద్యమంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. పెడన నియోజకవర్గంలో అభివృద్ధి ఉపాధి కల్పనకు విరాళాలు ఇచ్చి పీ- 4 కార్యక్రమాలలో భాగస్వామి అయిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.పేదరికంలో ఉన్న కుటుంబాలను దత్తత తీసుకుని వారి ఆర్థిక స్థితిని మెరుగుపరిచేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఈ సందర్భంగా కాగిత కృష్ణ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల అధికారులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పాస్‌పోర్టులు సరెండర్ చేయాలి

**అనంతబాబు, లక్ష్మీదుర్గకు జిల్లా కోర్టు ఆదేశం**

దళిత యువకుడు సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీదుర్గపై నాన్ బెయిలబుల్ వారెంట్ రద్దు చేసిన జిల్లా కోర్టు - నిందితుల పాస్ పోర్ట్‌లు కోర్టుకి సరెండర్ చేయాలని ఆదేశం దళిత యువకుడు, డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ అనంతబాబు భార్య లక్ష్మీ దుర్గకి రాజమహేంద్రవరం జిల్లా కోర్టులో ఉరట కలిగింది. ఈ కేసులో లక్ష్మీ దుర్గపై ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్‌ను రద్దు చేస్తు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తీర్పు వెల్లడించారు. అలానే నిందితులు ఎమ్మెల్సీ అనంత బాబు, ఆయన భార్య లక్ష్మీ దుర్గ పాస్ పోర్ట్‌లు కోర్టుకి సరెండర్ చేయాలని కోర్టు ఆదేశించింది.అదే విధంగా 15 రోజులకు ఒకసారి పోలీస్ స్టేషన్లో హాజరై సంతకం చేయాలని 50 వేల రూపాయల పూచికత్తు పెట్టాలని ఆదేశాలు ఇచ్చింది. ఇంక సాక్షుల్ని ఎలాంటి ప్రభావితం చేయకూడదని బాధితులకు సాక్షులకు పూర్తి భద్రత కల్పించాలని కాకినాడ జిల్లా ఎస్పీకి ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో ఈ నెల 16 నుంచి 29వ తేదీ వరకు కాకినాడలో సిట్ విచారణను లక్ష్మీదుర్గ ఎదుర్కొన్న విషయం తెలిసిందే. 12 రోజుల్లో 84 గంటల పాటు పోలీసులు ప్రశ్నించారు. అన్ని ప్రశ్నలకూ తెలియదు, గుర్తులేదు, మరచిపోయా అంటూ తప్పించుకునేలా జవాబులు ఇచ్చారు.అజ్ఞాతంలో ఉన్న లక్ష్మీదుర్గ సిట్ ముందుకు: తమ దగ్గర డ్రైవర్‌గా పనిచేసి, మానేసిన సుబ్రహ్మణ్యాన్ని చంపి డోర్ డెలివరీ చేసిన కేసులో అనంతబాబుతో పాటు ఆయన భార్య లక్ష్మీదుర్గ పాత్ర కూడా ఉన్నట్లు పోలీసులు ఇటీవల విచారణలో గుర్తించిన విషయం తెలిసిందే. ఆమెను ఏ2గా చేర్చి రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టులో అనుబంధ ఛార్జిషీట్ వేశారు. కోర్టు ఆమెపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది.దీనిని కొట్టేయాలని లక్ష్మీదుర్గ హైకోర్టును ఆశ్రయించగా ఈ నెల 16 నుంచి 30 వరకు సిట్ ఎదుట, 30న రాజమహేంద్రవరం కోర్టులో విచారణకు హాజరవ్వాలని తీర్పు ఇచ్చింది. దీంతో అప్పటి వరకూ అజ్ఞాతంలో ఉన్న ఎమ్మెల్సీ భార్య లక్ష్మీదుర్గ ప్రత్యేక దర్యాప్తు బృందం ముందుకు వచ్చారు. అలాగే సర్పవరం సీఐ పెద్దిరాజు, ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు కూడా విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో మరి కొందరు



ఉన్నారని నిజ నిజాలు నిగ్గు తేల్చాలని కేసు విచారణ నీరుగార్చిన ఆనాటి పోలీస్ అధికారులపైన విచారణ చేపట్టాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య: దళిత యువకుడు తన వద్ద డ్రైవర్‌గా పని చేసిన సుబ్రహ్మణ్యాన్ని 2022 మే 19న కాకినాడలో వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ అనంత సత్య ఉదయ భాస్కరరావు అలియాస్ అనంతబాబు దారుణంగా హతమార్చారు. మృతదేహాన్ని కాకినాడలో నివాసం ఉంటున్న సుబ్రహ్మణ్యం ఇంటి వద్దకు స్వయంగా డోర్ డెలివరీ చేశారు. ఈ కేసును అప్పట్లో అధికారంలో ఉన్న వైఎస్సార్సీపీ ప్రభుత్వం తొలి నుంచీ నీరుగార్చే ప్రయత్నాలే చేసింది.

# '2.37 లక్షలకు పైగా ఓటర్లకు ఇంటి వద్దే ఓటు సౌకర్యం'

**ఈసీ కీలక ప్రకటన అత్యధికంగా 1,45,521 మంది వృద్ధులకు ఇంటి వద్ద ఓటింగ్**


**అందుబాటులో లేకపోతే, రెండోసారి కూడా ప్రయత్నిస్తాం ఈసీ**

త్వరలో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలపై భారత ఎన్నికల సంఘం కీలక ప్రకటన చేసింది. సాధారణ, ఉప ఎన్నికల్లో కలిపి సుమారు 2.37 లక్షలకు పైగా ఓటర్లు ఇంటి వద్దే ఓటు వేసే సౌకర్యాన్ని వినియోగించుకోనున్నట్లు వెల్లడించింది. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 60(సి) ప్రకారం 85 ఏళ్లు దాటిన వృద్ధ ఓటర్లకు, ఓటర్ల జాబితాలోని దివ్యాంగులకు ఇంటి వద్దనే ఓటు వేసే సౌకర్యం ఉందని తెలిపింది. వారంతా పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటును వేయవచ్చని ఈసీఐ చెప్పింది. ఇందుకు అర్హత ఉన్న ఓటర్లు నోటిఫికేషన్ తేదీ నుంచి 5 రోజుల్లోపు తమ సంబంధిత రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. దీని ప్రకారం కేరళ, అసోం, పుదుచ్చేరిలో ఇంటి వద్ద ఓటింగ్ సౌకర్యం కోసం ఇప్పటివరకు 2.37 లక్షలకు పైగా ఓటర్లకు రిటర్నింగ్ అధికారులు ఆమోదం తెలిపారని ఈసీ తెలిపింది. వీరిలో 85 ఏళ్లు దాటిన వారు అత్యధికంగా 1,45,521 మంది ఇంటి వద్ద ఓటింగ్ కోసం ఆమోదం తెలిపారని వివరించింది.అందుబాటులో లేకపోతే, రెండోసారి కూడా ప్రయత్నిస్తాం : ఈసీఇంటి వద్ద ఓటింగ్ షెడ్యూల్‌ను ఓటరుకు ముందుగానే తెలియజేస్తారని ఈసీ చెప్పింది. వారి ఓటు కోసం పోలింగ్ అధికారుల బృందం ఓటరు నివాసానికి వెళ్తుందని ఎన్నికల సంఘం వివరించింది. "కేరళ, అసోం, పుదుచ్చేరిలోని వివిధ నియోజకవర్గాల్లో ఇంటి వద్ద ఓటింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. ఈ ప్రక్రియ ఏప్రిల్ 5వ తేదీలోగా పూర్తవుతుంది. మొదటిసారి ఓటరు అందుబాటులో లేకపోతే, రెండోసారి కూడా ప్రయత్నిస్తాం" అని ఈసీ ప్రకటనలో పేర్కొంది.ఓటింగ్ ప్రక్రియ మొత్తం రికార్డ్ఓటు గోప్యతను రక్షిస్తూనే అత్యంత పారదర్శకత కోసం పోలింగ్ అధికారులతో పాటు పోలీసు భద్రతతో కూడిన ఒక వీడియోగ్రాఫర్ ఉంటారని చెప్పింది. మొత్తం ప్రక్రియను వీడియో తీస్తారని ఈసీఐ వివరించింది.




"గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులకు, ఇంటి వద్ద ఓటింగ్ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్న ఓటర్ల జాబితాను అందిస్తారు. పోలింగ్ బృందాల పర్యటనల షెడ్యూల్‌ను అభ్యర్థులందరికీ సమాచారం ఇస్తారు. వారు కోరుకుంటే ఫారం 10లో రిటర్నింగ్ అధికారికి సమాచారం అందించిన తర్వాత, పోలింగ్ బృందాలతో పాటు తమ ప్రతినిధిని పంపవచ్చు." అని అందులో పేర్కొన్నారు.హోం ఓటింగ్ ఎంచుకోని వృద్ధ, దివ్యాంగ ఓటర్లకు అన్ని సౌకర్యాలుఇంటి వద్ద ఓటింగ్ సౌకర్యాన్ని ఎంచుకోని 85 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగ ఓటర్లకు సౌకర్యవంతమైన ఓటింగ్ అనుభవాన్ని అందిస్తామని ఎన్నికల సంఘం చెప్పింది. పోలింగ్ కేంద్ర ప్రవేశ ద్వారం వెలుపల ఓటర్ల మొబైల్ ఫోన్ డిపాజిట్ సౌకర్యం కల్పించాలని సూచించింది.


# ఇండియా పోస్ట్ పేరిట ఘరానా మోసాలు




ఇండియా పోస్ట్ 170వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత బహుమతులు అందిస్తోందంటూ సోషల్ మీడియా, వాట్సాప్‌లలో ఒక సందేశం విపరీతంగా వ్యాపిస్తోంది. అయితే ఇది పూర్తిగా నకిలీ అని, సైబర్ నేరగాళ్లు వ్యక్తిగత సమాచారం దొంగిలించడానికి పన్నిన వల అని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ సందేశంలో ఉండే లింక్‌ను క్లిక్ చేసి వ్యక్తిగత వివరాలు నమోదు చేస్తే మోసపోవడం ఖాయమని హెచ్చరించింది.ఈ మోసంపై కేంద్ర ప్రభుత్వానికి చెందిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ విభాగం ప్రజలను అప్రమత్తం చేసింది. ఇండియా పోస్ట్ ఎలాంటి లక్కీ డ్రాలు గానీ, బహుమతుల పంపిణీ గానీ నిర్వహించడం లేదని, వైరల్ అవుతున్న సందేశం ఒక స్కామ్ అని తేల్చిచెప్పింది. 'ఇండియా పోస్ట్ పేరుతో జరుగుతున్న ఈ లక్కీ డ్రా నకిలీది. ఇలాంటి అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయకండి. మీ వ్యక్తిగత వివరాలను పంచుకోకండి' అని అధికారులు హెచ్చరించారు.ఇలాంటి మోసాల బారిన పడకుండా ఉండాలంటే తెలియని నంబర్ల నుంచి వచ్చే లింకులను క్లిక్ చేయవద్దని నిపుణులు సూచిస్తున్నారు. ఏదైనా ఆఫర్ లేదా ప్రకటనపై సందేహం ఉంటే, నేరుగా ఇండియా పోస్ట్ అధికారిక వెబ్‌సైట్ లేదా వారి సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించడం ఉత్తమమని వారు చెబుతున్నారు. డిజిటల్ యుగంలో అప్రమత్తంగా ఉండటమే సైబర్ మోసాల నుంచి రక్షణ అని సూచిస్తున్నారు.

# శ్మశానంలో గ్యాస్ సిలిండర్ల దందా

**హైదరాబాద్‌లో భారీ రాకెట్ గుట్టురట్టు**



హైదరాబాద్‌లో భారీ అక్రమ గ్యాస్ సిలిండర్ల రాకెట్‌ను పోలీసులు ఛేదించారు. గల్ఫ్ యుద్ధం కారణంగా ఏర్పడిన ఎల్పీజీ కొరతను ఆసరాగా చేసుకుని అధిక ధరలకు సిలిండర్లను విక్రయిస్తున్న ముఠాను అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్‌లోని ఓ శ్మశాన వాటికలో అక్రమంగా నిల్వ ఉంచిన 414 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని, ఈ దందాకు పాల్పడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నారు.హైదరాబాద్ కమిషనర్ టాస్క్‌ఫోర్స్, బంజారాహిల్స్ పోలీసులు సోమవారం ఈ జాయింట్ ఆపరేషన్ నిర్వహించారు. నిందితులు అధిక లాభం కోసం సిలిండర్లను బ్లాక్ మార్కెట్లో అమ్ముతున్నారని పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ తెలిపారు. వారి నుంచి 11 రవాణా వాహనాలతో కలిపి మొత్తం రూ.21.88 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.పోలీసుల కథనం ప్రకారం, శంషాబాద్ కేంద్రంగా 'మెట్రో గ్యాస్ ఏజెన్సీ' నిర్వహిస్తున్న మహ్మద్ అమీర్ ఈ రాకెట్‌లో ప్రధాన సూత్రధారి. ఇతను బంజారాహిల్స్‌లోని నాగార్జున ఎక్స్ రోడ్ సమీపంలోని శ్మశానంలో హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేసి, అవసరమైన వారికి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ తెలిపారు.అరెస్ట్ అయిన వారిలో గ్యాస్ ఏజెన్సీ యజమాని, డెలివరీ బాయ్స్, డ్రైవర్లు, కార్మికులు ఉన్నారు. స్వాధీనం చేసుకున్న వాటిలో వివిధ కేజీల బరువున్న సిలిండర్లు, డీసీఎం వ్యాన్లు, బొలెరో వాహనాలు, ఆటోలు ఉన్నాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# లక్ష కోట్ల ప్రజాధనం వృథా

**కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్రమంత్రి సంచలన వ్యాఖ్యలు**




కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ ప్రాజెక్టుపై రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ, లక్ష కోట్ల ప్రజాధనం వృథాగా నీళ్లలో పోశారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు లోపాలను కేంద్ర బృందం అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. కాళేశ్వరం వైఫల్యానికి ప్లానింగ్, డిజైన్ లోపాలు కారణమని అన్నారు.కాళేశ్వరంను జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలని రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ సురేశ్ రెడ్డి కోరారు. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో ప్రజాధనం వృథా అయిందని ఆరోపించారు. కాగా, ఈ ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై సీబీఐతో విచారణ జరిపించాలని ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు.కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ ఇంకా మాట్లాడుతూ, జల్ జీవన్ నిధుల వినియోగంలో తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ళుగా ఒక్క ప్రతిపాదన పంపించలేదని అన్నారు. తెలంగాణ వద్ద జల్ జీవన్ మిషన్ నిధులు రూ.873 కోట్లు ఉన్నట్లు తెలిపారు. అంత పెద్ద మొత్తంలో నిధులు ఉన్నప్పటికీ రూ.194 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారని విమర్శించారు.

# ఏ తప్పు చేయకపోయినా కావాలనే వేధిస్తున్నారు

**సీఐడీ నోటీసులపై కౌశిక్ రెడ్డి స్పందన**



తనకు సీఐడీ నోటీసులు అందడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఎక్స్ వేదికగా తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాననే కక్షతోనే తనను ఇబ్బంది పెడుతున్నారని ఆయన ఆరోపించారు. "రేవంత్ రెడ్డి గారు... నన్ను లక్ష్యంగా చేసుకోండి, నాపై ఎన్ని కేసులైనా పెట్టండి, నోటీసులు ఇవ్వండి. కానీ నా కుటుంబాన్ని, మా బీఆర్ఎస్ కుటుంబ సభ్యులను ఈ గొడవల్లోకి లాగి ఇబ్బంది పెట్టడం ఎంతవరకు న్యాయం?" అని ప్రశ్నించారు. ఏ తప్పు చేయకపోయినా కావాలనే వేధిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్ని నోటీసులు ఇచ్చినా, ఎన్ని బెదిరింపులకు గురిచేసినా తాను వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. "ఇది నా వ్యక్తిగత పోరాటం కాదు, ప్రజల కోసం చేస్తున్న పోరాటం. మీరు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు మిమ్మల్ని నిలదీస్తూనే ఉంటాను" అని హెచ్చరించారు. ప్రశ్నించే గొంతును అధికార బలంతో అణచివేయలేరని, ప్రజల పక్షాన తన పోరాటం నిరంతరం కొనసాగుతుందని అన్నారు.జనవరి 29న హుజూరాబాద్ నియోజకవర్గం వీణవంకలో జరిగిన మినీ మేడారం జాతర సందర్భంగా పోలీసులతో కౌశిక్ రెడ్డి వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో, ఆయనపై కేసు నమోదయింది. ఈ క్రమంలో, ఏప్రిల్ 4న విచారణకు హాజరుకావాలని సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేశారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com